



ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు తయారు చేస్తున్న శ్రీవారి సేవకులు

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే..

దేవతలారా.. దీవించండి

- ప్రారంభమైన కోదండరాముడి బ్రహ్మోత్సవాలు
- వైభవంగా ధ్వజారోహణం
- రామాలయానికి పోటెత్తిన భక్తులు
- ముత్యాల తలంబ్రాల తయారీలో శ్రీవారి సేవకులు
- ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ జేఈవో, జేసీ



ధ్వజారోహణం చేస్తున్న వేద పండితులు





ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 17: ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య గరుడపటాన్ని ప్రతిష్ఠించి కంకణభట్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేశారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ధ్వజస్తంభం వద్ద నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మీలనం చేశారు. ధ్వజస్తంభం నమస్కారం, నవసిద్ధి బలి పక్షణం, ధ్వజస్తంబానికి నవకలశ పంచామృతాభిషేకం చేసి రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాద్రి సకల దేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, వీజీవో బాలిరెడ్డి, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ

కోదండరామాలయంలో స్వామి వారి దర్శనం కోసం విచ్చేసిన భక్తుల కోసం టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టింది. పెద్దఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని తూర్పు గోపురం ఎదురుగా టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసింది. ఎండవేడిమిని తట్టుకునేందుకు వీలుగా భక్తులకు క్యూలైన్‌లో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను ప్రత్యేక సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ అందిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎండ వేడిమి నుంచి భక్తులకు ఇబ్బంది లేకుండా జర్మన్ షెడ్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ప్రతిరోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నం, సాంబారు, రసం, మజ్జిగ, పచ్చడి, కర్రీ బెల్లం, పొంగలి అందించనున్నారు. అందుకోసం టీటీడీ ప్రత్యేకంగా తిరుమల నుంచి వంట సిబ్బందిని ఏర్పాటు చేశారు.

కల్యాణానికి తలంబ్రాలు తయారీ

కోదండరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 22న జరగనున్న సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో బుధవారం తలంబ్రాల తయారీ కార్యక్రమాన్ని చేపట్టారు. తలంబ్రాల ప్యాకెట్ల తయారీని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్‌ను శ్రీవారి సేవకులతో ప్రారంభించినట్లు తెలిపారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్ద గల పీఏసీ వద్దకు తీసుకొచ్చారన్నారు. పీఏసీ హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలతో పాటు కర్నూలు, రాజమండ్రి నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించేందుకు శ్రీవారి సేవకులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు 1.20 లక్షల తలంబ్రాల ప్యాకెట్లను తయారు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షన్ముఖ కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఐ-2 జగదీశ్వర్‌రెడ్డి, వీజీవో బాలిరెడ్డి, డిప్యూటీ ఈవోలు ప్రశాంతి, హరికృష్ణ, గుణభూషణ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



భక్తులతో పోటెత్తిన కోదండరామాలయం



శేష వాహనంపై రామయ్య విహారం



ఏర్పాట్లు పరిశీలన

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవం రోజున భక్తుల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ కలిసి కల్యాణ వేదిక ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతులు ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. కడప జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పటిష్ఠ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదం కౌంటర్లు, లైటింగ్, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, అదనపు పారిశుధ్య సిబ్బంది తదితర అంశాలపై సమీక్షించారు. అంతకుముందు ఒంటిమిట్ట ఆలయం వద్ద గల పరిపాలనా భవనంలో జేఈవో టీటీడీ, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అదనపు ఎస్పీ వెంకటరాముడు, సీఐ పురుషోత్తంరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

శేష వాహనంపై సీతారామలక్ష్మణులు

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజైన బుధవారం రాత్రి శేషవాహనంపై సీతాలక్ష్మణ సమేత రాముల వారు భక్తులకు అభయమిచ్చారు. భజన బృందాలు, కోలాటాల నడుమ పురవీధుల్లో స్వామి విహరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వేణుగానాలంకారం, రాత్రి హంసవాహనంపై కోదండరాముడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



నేటి నుంచి నామినేషన్లు ప్రారంభం

- ఎంపీ అభ్యర్థులు రాయచోటిలో..
- ఎమ్మెల్యే అభ్యర్థులు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో...
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

రాయచోటి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం నేడు ప్రకటన విడుదల చేయనుంది. దీంతో ఇప్పటికే పలువురు అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. అదే సమయంలో అధికారులు సైతం నామినేషన్ల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేశారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో రాజంపేట పార్లమెంటు స్థానంతో పాటు తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు వస్తాయి. పార్లమెంటు స్థానానికి జిల్లా కేంద్రం రాయచోటిలో నామినేషన్ దాఖలు చేస్తారు. అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఆయా ఆర్డీవో కార్యాలయాలు, లేదా తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు దాఖలు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా నామినేషన్లు దాఖలు చేయడానికి జిల్లా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కానున్న తొలిరోజు పీలేరు అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థిగా టీడీపీ తరఫున నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఉదయం 11.30 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. తంబళ్లపల్లెకు వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల అధికారులు, పోలీసులు గట్టి చర్యలు తీసుకోనున్నారు.

సుగవాసి బాలసుబ్రమణ్యంకు ప్రజల బ్రహ్మరథం

- పెద్దఎత్తున పాల్గొన్న మహిళలు
- అడుగడుగునా ఘన స్వాగతం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 17 : రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట పట్టణం బోయపాలెం, మంగళమిట్ట వరదయ్యగారిపల్లె తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, యువనాయకుడు మల్లెల సురేంద్ర, మైనారిటీ నాయకులు అబూబకర్, మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి అమ్మినేని అజయ్, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, గీతాంజలి విద్యాలయాల అధినేత ఎస్.వి.రమణ, బలిజ సంఘ జిల్లా అధ్యక్షుడు టైల్స్ నరసింహ, మాజీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మంగళమిట్టలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

హామీలు మరిచావా.. జగనా..!

- అధికారమే లక్ష్యంగా పాదయాత్రలో అలవికాని హామీలు
- అధికారంలోకి రాగానే.. మడతబెట్టేశాడు
- హంద్రీ-నీవా పనులేమయ్యాయి...
- బి.కొత్తకోటకు ఆర్టీసీ డిపో, బస్టాండు ఇంకా రాలేదే..
- అధ్వాన్న రోడ్లలో ప్రయాణమెలా..
- ఆంధ్రా ఊటీ హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి జాడేది..
- హార్టికల్చర్ హబ్ ఏమైందన్నా..
- ఈ హామీలు నెరవేరేదెప్పుడని ప్రశ్నిస్తున్న ప్రజలు



నిరుపయోగంగా హంద్రీ-నీవా కాలువ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఓ తెలుగు సినిమాలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఒక రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు.. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. మన ఊరికి సముద్రం తెస్తానని హామీ ఇస్తాడు.. మన ఊరికి ఎటుచూసినా సముద్రం దగ్గర్లో లేదు కదా.. ఎలా తెస్తారని ప్రజలు ప్రశ్నిస్తారు. ముందు నన్ను గెలిపించండి.. తర్వాత మీ హామీ తీర్చకపోతే అడగమని సమాధానం చెప్తాడు.. అమాయక జనాలు అతడికి ఓటు వేసి గెలిపిస్తారు.. అచ్చం ఆ సినిమాలో మాదిరే ప్రతిపక్ష నేత హోదాలో అధికారం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై అలవికాని హామీల వర్షం కురిపించాడు. పాదయాత్ర సందర్భంగా రాష్ట్రమంతా తిరిగిన జగన్ అడిగిన.. అడగని వాళ్లనూ.. హామీల హోరులో ముంచెత్తాడు. అయితే జగన్ హామీలను నమ్మిన జనం జగన్ పార్టీకి బ్రహ్మరథం పట్టారు. అధికారంలోకి రాగానే తాను ఇచ్చిన హామీలను గాలికి వదిలేశాడు. దీంతో జగనన్న పాదయాత్ర మిగిల్చిన పాదముద్రలు అమలు కాని హామీలకు సజీవ సాక్ష్యంగా జనాలను వెక్కిరిస్తున్నాయి.

హామీల ఊసెత్తని ముఖ్యమంత్రి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గంలో 2017 డిసెంబరు 29, 30, 2018 జనవరి 1 తేదీల్లో తంబళ్లపల్లె, కురబలకోట మండలాల్లో ప్రజా సంకల్పయాత్ర పేరుతో పాదయాత్ర చేశారు. పాదయాత్ర చేపట్టి, ఆరేళ్ల మూడు నెలలకు ముఖ్యమంత్రి హోదాలో ఈనెల 1వ తేదీ నియోజకవర్గంలో బస్సుయాత్రను నిర్వహించారు. ములకలచెరువు, బి.కొత్తకోట, కురబలకోట మండలాల మీదుగా మదనపల్లెకు వెళ్లారు. ఎక్కడా గతంలో తాను చేసిన హామీల గురించి ప్రస్తావించలేదు. గతంలో పాదయాత్ర సందర్భంగా ఆయన పలు హామీలు ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య చాలా తీవ్రంగా ఉంది ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఇక్కడి ప్రజలు ఫ్లోరైడ్‌తో అవస్థలు పడుతూనే ఉన్నారు. కేవలం వర్షాధారంపైన పంటలు సాగు చేసుకునే ఈ ప్రాంత రైతులకు వేరుశనగ, మామిడి, టమోటా పంటలే ఆధారం. ఈ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో ఒకటి కూడా నెరవేరలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి కన్నా ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులు, వేధింపులు, అరాచకాలే అధికంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి.

జగన్ ఇచ్చిన హామీలు

తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రం ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రతి ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. ఇక్కడ రైతులకు కనీస వసతులు లేవు. రైతులకు తాగునీటి వసతి కూడా లేదు. విశ్రాంతి భవనం లేదు. మూడేళ్లుగా తాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడికి ప్రతిరోజూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి వందలాది మంది రైతులు టమోటాలు తీసుకొస్తారు. మార్కెట్ కమిటీ వాణిజ్య గదుల నిర్మాణం కోసం చేపట్టిన పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి.

రోడ్లు మరీ అధ్వాన్నం

వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోడ్ల మరమ్మతులను ప్రభుత్వం గాలి కొదిలేయడంతో ప్రయాణికులకు చుక్కలు కన్పిస్తున్నాయి. ములకలచెరువు నుంచి నియోజకవర్గ కేంద్రం తంబళ్లపల్లెకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉంది. రోడ్డు గుంతలమయం కావడంతో ఈ మార్గంలో ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లెలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కోర్టుతో వివిధ పనుల కోసం ప్రజలు నిత్యం వెళ్లి వస్తూ ఉంటారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. గూడుపల్లె-కాలువపల్లె రోడ్డు, వేపూరికోట క్రాస్-దేవళచెరువు రోడ్డు, బురకాయలకోట సబ్‌స్టేషన్-బి.కొత్తకోట, చీకుచెట్టుపల్లె క్రాస్-బి.కొత్తకోట తదితర రోడ్లు గుంతలు పడినా.. ఎవరూ పట్టించుకోలేదు.

షాదీమహాళ్లకు పైసా నిధులు లేవు

ములకలచెరువు, బి.కొత్తకోటల్లోని ముస్లిం మైనార్టీల షాదీమహల్‌కు వైసీపీ ఐదేళ్ల పాలనలో పైసా నిధులు విదల్చలేదు. నిరుపేద ముస్లిం యువతీ, యువకుల వివాహాల కోసం నిర్మించిన ఈ షాదీమహాళ్లు కనీస వసతులు లేక దుస్థితికి చేరుకున్నాయి. తాగునీటి వసతి, కరెంటు సౌకర్యం తదితర కనీస వసతులు కూడా లేవు. కిటికీలకు అద్దాలు కూడా లేవు. షాదీమహాల్ గురించి పట్టించుకోకపోవడంతో ఇక్కడ పెళ్లిళ్లు జరగడం లేదు. ముస్లింలకు మంచి చేశామని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి ఈ షాదీమమహాళ్లు కన్పించినట్లు లేదు.

అటకెక్కిన హంద్రీ-నీవా పనులు

నిత్యం కరువు ప్రాంతమైన నియోజకవర్గానికి హంద్రీ-నీవా సుజలస్రవంతి పథకం ద్వారా సాగునీరు అందిస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఐదేళ్లయినా ఇప్పటికీ ఇక్కడికి నీళ్లు మాత్రం రాలేదు. అసలు జగన్ ముఖ్యమంత్రి అయ్యాకా.. హంద్రీ-నీవా సుజల స్రవంతి కోసం ఏమాత్రం నిధులు కేటాయించలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో హంద్రీ - నీవా సాగునీటి కాలువలు నిరుపయోగంగా ఉన్నాయి. వర్షాకాలంలో వర్షాలకు కాలువలకు గండ్లు పడ్డా, తెగిపోయినా మరమ్మతులు కూడా చేయడం లేదు. గాలేరు-నగిరి సుజల స్రవంతి పథకంలో భాగంగా గండికోట జలాలను నియోజకవర్గానికి తీసుకొచ్చేందుకు చేపట్టిన పనుల్లో పెద్దమండ్యెం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదు.

హామీలు గుర్తయినా ఉన్నాయా.. జగన్..

బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపో, ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా అది నెరవేర్చలేదు. బి.కొత్తకోటకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇక్కడ వ్యవసాయ మార్కెట్ ఉన్నా నిరుపయోగంగా ఉంది. పర్యాటక కేంద్రమైన హార్సీలీహిల్స్‌లో అభివృద్ధి పనుల జాడేలేదు. హార్సిలీ హిల్స్ కింద హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసేందుకు భూమి కేటాయించినా పనులు ప్రారంభించలేదు. బి.కొత్తకోటను మున్సిపాలిటీగా ప్రకటించినా అభివృద్ధి పనులు జరగలేదు. కురబలకోట మండలం అంగళ్లలో ప్రతి శనివారం జరిగే గొర్రెల సంతలో కనీస వసతులు కల్పించలేదు. రాయలసీమలోనే అతిపెద్ద సంతగా పేరొందిన గొర్రెల సంత ద్వారా ఆదాయం అధికంగా ఉన్నా సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు కనీస వసతులు లేవు. పెద్దమండ్యం మండలంలో నల్లరాతి మడుగు ప్రాజెక్టు పనులు చేపట్టలేదు. పనులు తొలి దశలోనే ఉన్నాయి. వీటన్నింటినీ గుర్తించిన ప్రజలు ముక్తకంఠంతో అడుగుతున్న మాట ఒక్కటే.. జగనన్నా.. ప్రతిపక్ష నేత హోదాలో మాకు హామీలు ఇచ్చారు..ముఖ్యమంత్రిగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు.. మాకు ఇచ్చిన హామీలు కనీసం గుర్తున్నాయా అని అడుగుతున్నారు.



పిల్లర్లకే పరిమితమైన ములకలచెరువు మార్కెట్ కమిటీ వాణిజ్య గదుల నిర్మాణం



అధ్వానంగా ఉన్న నియోజకవర్గ కేంద్రం తంబళ్లపల్లెకు వెళ్లే రోడ్డు

నామినేషన్లకు సబ్ కలెక్టరేట్ సిద్ధం

- నిబంధనలు వెల్లడించిన రిటర్నింగ్ అధికారి



నాలుగు కౌంటర్లతో నామినేషన్ స్వీకరించే రిటర్నింగ్ అధికారి గది వద్ద పూర్తి చేసిన ఏర్పాట్లు

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 17: మదనపల్లె నియోజకవర్గం (164 అసెంబ్లీ నియోజకవర్గం)కు సంబంధించి సాధారణ ఎన్నికల నామినేషన్ పర్వానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారి, నలుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు నామినేషన్ ప్రక్రియ మొత్తం పూర్తిగా వెబ్‌క్యాస్టింగ్ చేసేందుకు సీసీ కెమెరాలు, టీవీలు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఆదివారం సెలవు రోజు తప్ప మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే నామినేషన్ హాల్లోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థి ఫారం-26 అఫిడవిట్‌తో పాటు అవసరమైన పత్రాలు జత చేయాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఒక్కొక్క ప్రతిపాదకులు, బలపరిచేవారు ఉండాలని, స్వతంత్ర్య అభ్యర్థులు పది మంది ప్రతిపాదకులు, బలపరిచేవారు ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియ మొత్తం వీడియో, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని, వెబ్‌క్యాస్టింగ్ కూడా ఉంటుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు పబ్లిక్ డొమైన్‌లో, నోటీసు బోర్డులో నామినేషన్‌లకు సంబంధించి వివరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. సబ్‌కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి 100 మీటర్ల వరకు నిషిద్ధ ప్రాంతంగా పరిగణిస్తామన్నారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తారని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు రమాదేవి, బాలాజి రాజు, శ్రీనివాసులు, ప్రమీల పాల్గొన్నారు.

ఐదుగురికే అనుమతి : ఆర్‌ఓ



రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: నామినేసన్లు వేసేందుకు అభ్యర్థి సహా ఐదుగురికే అనుమతులు ఉంటాయని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18వ తేదీ గురువారం నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల పక్రియ కొనసాగుతోందన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థి వంద మీటర్లలోపు గేటు వద్ద ఆగాలని అక్కడి నుంచి అభ్యర్థి సహా ఐదుగురికి మాత్రమే లోనికి అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్లు వేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జనరల్ కేటగిరీ వారికి రూ.10 వేలు చలానా, నగదు రూపంలో కానీ నామినేషన్ వేసే చోట ఇవ్వవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలకైతే అయిదు వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థులు రాష్ట్రంలో ఎక్కడివారైనా వారికి ప్రతిపాదన చేసే వారు సుమారు పది మంది స్థానికులే ఉండాలన్నారు. నామినేషన్లు ఆన్‌లైన్ ద్వారాకూడా వేయవచ్చని ఆయన తెలియజేశారు.

నరకదారులు...

- వైసీపీ ప్రభుత్వంలో రోడ్లన్నీ ఛిద్రం
- ఒక్క రోడ్డుకు మరమ్మతులు చేయలేదు
- అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- నిధులు లేక ఆగిన రోడ్ల పనులు
- అవస్థల్లో వాహనదారులు, ప్రయాణికులు
- నాలుగేళ్లుగా సాగుతున్న రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల పనులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



కంకర తేలి అలాగే వదిలేసిన రాయచోటి-సుండుపల్లె రోడ్డు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17: జిల్లా పరిధిలోని ఇటు రాయచోటి నియోజకవర్గం, అటు రాజంపేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఆ రెండు రోడ్ల పనులు అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నాలుగు సంవత్సరాలుగా జరుగుతూనే ఉన్నాయి దీంతో ప్రయాణికులకు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నరకానికి దారులుగా మారిన రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ఈ ప్రాంతాల ప్రజలతో పాటు ప్రయాణికులు, వాహనదారుల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు సంవత్సరాల క్రితం రాయచోటి-సుండుపల్లె రోడ్డుతో పాటు రాయచోటి- సానిపాయి రోడ్లను డబుల్ లేన్‌లుగా మార్చాలని సంకల్పించింది. రాయచోటి నుంచి సుండుపల్లె వరకు డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.40 కోట్లు, రాయచోటి-సానిపాయి రోడ్డు మార్గంలోని షికారుపాలెం నుంచి సానిపాయి వరకు డబుల్‌లేన్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే నాలుగు సంవత్సరాల క్రితం ఆ పనులను పొందిన కాంట్రాక్టర్లు అధికారుల అలసత్వాన్ని, ప్రజాప్రతినిధుల అండదండలను ఆసరాగా తీసుకుంటూ రోడ్డును ఒకవైపు ఉంచి మరోవైపుకు చివర వరకు పనులు చేయకుండా రోడ్డు ఎక్కడ పడితే అక్కడ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తూ ప్రయాణికులు, వాహనదారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా రాయచోటి-సుండుపల్లె మార్గంలోని కుమ్మరపల్లి సమీపంలో కూడా ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు ఎక్కడ పడితే అక్కడ పనులను చేస్తూ రోడ్డుపై కంకర తేలి అలాగే వదిలేయడంతో పాటు అనుంపల్లె అటవీ ప్రాంతంలో అటవీ అనుమతులు లేవంటూ పనులను పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో వర్షాలకు రోడ్డుకిరువైపులా కోతలకు గురై బస్సులు, వాహనాలు తొలగాలంటేనే నానా అవస్థలు పడే పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. అందులోనూ ఒకవైపు నుంచి రోడ్డు పనులు పూర్తిగా చేయకుండా వారికి ఎక్కడ సులభతరంగా ఉంటే అక్కడ పనులు చేస్తూ కష్టతరంగా ఉన్నచోట, కల్వర్టులు ఉన్న చోట అలాగే వదిలేయడంతో ఆ రోడ్డులో ప్రయాణించాలంటేనే ప్రయాణికులకు నరకం కనబడుతోంది. దీనికి తోడు అటవీశాఖ అనుమతులు వచ్చినప్పటికీ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చేపట్టకపోవడంతో అక్కడ సింగిల్ రోడ్డు వలన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక శిబ్యాల సమీపంలో ఈదుల వంకపై ఉన్న పాత కల్వర్టు స్థానంలో కొత్త బ్రిడ్జిని ఏర్పాటు చేసే క్రమంలో పిల్లర్స్ వేసి అలాగే వదిలేయడం వలన పాత బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రయాణికులు, వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగు సంవత్సరాలుగా రోడ్డు పనులు సక్రమంగా చేయకుండా అక్కడక్కడా కంకర తేలి అలాగే వదిలేయడం వలన రాత్రి సమయాల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

> వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డు పని కూడా పూర్తి చేయలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లే తప్ప ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డుకు మరమ్మతులు చేసిన పాపాన పోలేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతుకుల రోడ్లలో ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడే ప్రమాదం జరుగు తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

అలాగే రాయచోటి-సానిపాయి మార్గంలోని షికారుపాలెం నుంచి సానిపాయి వరకు డబుల్‌లేన్ రోడ్డు పనులు నాలుగు సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయి. ఆ మార్గంలో శీతంపేట వద్ద కొంత దూరం జంగంపల్లి వద్ద కొంత దూరం సానిపాయి సమీపంలో కొంతదూరం అక్కడక్కడా రోడ్డు పనులు చేపట్టి మిగిలిన చోట్ల కంకర తేలి అలాగే వదిలేయడం వలన వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అలాగే షికారుపాలెం నుంచి శీతంపేట వరకు మూడు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వలన రోడ్డుకు ఇరువైపులా వర్షానికి సింగిల్ రోడ్డు కోతకు గురికావడంతో బస్సులు క్రాస్ అయ్యే సమయంలో ఇబ్బందులు పడుతూ డ్రైవర్లు వాహనాలను నడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతేగాక కొత్తరోడ్డు, కొత్తపల్లి, కంకర మిషన్ ప్రాంతాల్లో కంకర తేలి అలాగే వదిలేయడం వలన ఆ ప్రాంతంలో ప్రయాణికులతో పాటు ద్విచక్రవాహనదారులు కూడా ఆ దారిన ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం వలన ఈ రోడ్లలో ప్రయాణించాలంటే నరకం చూడక తప్పడం లేదని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. నిర్దేశించిన గడువులోగా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకపోయినప్పటికీ వారిని తొలగించి ఆ స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా తమకు ఎందుకు వచ్చిన తంటలే అనే విధంగా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు వాహనదారులే తిప్పలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు అధికార పార్టీ నేతలు ప్రత్యేక చొరవ చూపి నరకదారులుగా మారిన రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల నిర్మాణం పనులను పూర్తి చేసి ప్రమాదాల బారి నుంచి తమను కాపాడాలంటూ ప్రయాణికులతో పాటు వాహనదారులు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈ వివరణ

జిల్లా కేంద్రమైన రాయచోటి పరిధిలోని రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి మార్గాల్లోని డబుల్ లేన్ రోడ్ల పనులు ఆలస్యంగా జరుగుతున్న విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా పనులకు సంబంధించి ఆరు నెలల క్రితం కొంతమేరకు పార్ట్ బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన పనులకు సంబంధించి నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. అలాగే సుండుపల్లె రోడ్డు, సానిపాయి రోడ్ల మార్గంలోని అటవీ ప్రాంతంలో కూడా రోడ్ల నిర్మాణానికి అనుమతులు కూడా వచ్చాయన్నారు. నిధులు మంజూరైన వెంటనే ఆ రోడ్ల పనులను పూర్తి చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.







రాయచోటి-సానిపాయి రోడ్డులో కంకర తేలి అలాగే వదిలేసిన దృశ్యం, రాయచోటి-సుండుపల్లె మార్గంలోని శిబ్యాల వద్ద పిల్లర్లు వేసి అలాగే వదిలేసిన బ్రిడ్జి, అనుంపల్లె అటవీ ప్రాంతంలో కోతకు గురైన రాయచోటి-సుండుపల్లె రోడ్డు

మోగనున్న ఎన్నికల నగారా

- నేటి నుంచి 25 వరకు నామినేషన్లు
- కడప పార్లమెంటు అభ్యర్థులు కలెక్టరేట్‌లో..
- అసెంబ్లీ అభ్యర్థులు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో
- 20న షర్మిల నామినేషన్
- పులివెందుల అసెంబ్లీ నుంచి 25న జగన్ నామినేషన్
- టీడీపీ, వైసీపీ అభ్యర్థుల జాబితా సిద్ధం



కడప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రి య గురువారం నుంచి మొదలు కానుంది. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఉదయం 11 నుంచి ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు ప్రకటించారు. ఇక సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను వైసీపీ, టీడీపీ ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కడప పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పోటీ చేయనున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిల పోటీ చేస్తున్నారు. పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులు కడపలోని కలెక్టరేట్‌లో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంది. ఇక అసెంబ్లీ అభ్యర్థులు ఆయా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లను దాఖలు చేయనున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం ఓటర్లు 16,21,760 మంది ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగనుంది.

నేటి నుంచి నామినేషన్లు

నోటిఫికేషన్ విడుదల	16.3.2024
నామినేషన్ దాఖలు	18.4.2024,
ఆఖరు తేది	25.4.2024
నామినేషన్ల పరిశీలన	26.4.2024
ఉపసంహరణ	29.4.2024
అదే రోజు పోటీ అభ్యర్థుల ప్రకటన	
పోలింగ్ తేది	13.5.2024
కౌంటింగ్	04.6.2024

నామినేషన్లు...

ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. గుర్తింపు పొందిన రాష్ట్ర లేదా జాతీయ పార్టీ అభ్యర్థి కోసం అదే నియోజకవర్గం నుంచి ఒక ఓటర్ ప్రతిపాదిస్తే సరిపోతుంది. గుర్తింపు లేని పార్టీ, స్వతంత్ర్య అభ్యర్థి పోటీ చేస్తే అదే నియోజకవర్గం నుంచి పది మంది ప్రతిపాదించాలి. నామినేసన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి 100మీటర్ల దూరం పరిధిలోకి మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

నామినేషన్లు ఎక్కడెక్కడంటే...

కడప పార్లమెంటుకు సంబంధించి కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని సి-బ్లాక్‌లో నామినేషన్ దాఖలు చేస్తారు. కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలకు కు సంబంధించి ఆర్డీఓ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరుకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఇక ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు జనరల్ అభ్యర్థులు అయితే రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12500 దరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేకు పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.10, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5వేలు దరావత్తు చెల్లించాలి.

అభ్యర్థులు సిద్ధం

సార్వత్రిక ఎన్నికల్లో తలపడే అభ్యర్థులను టీడీపీ, వైసీపీ ప్రకటించింది. కూటమి పరంగా జమ్మలమడుగు, బద్వేల్‌ను బీజేపీకి కేటాయించగా మిగిలిన చోట్ల టీడీపీ బరిలో ఉంది. ఇక వైసీపీ సిట్టింగ్‌లందరికి మళ్లీ టికెట్ ఇచ్చింది. ఇక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల కడప పార్లమెంట్ నుంచి పోటీచేస్తున్నారు. ఈనెల 20న నామినేషన్ దాఖలు చేయనున్నారు. బద్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా విజయజ్యోతిని ప్రకటించారు. పొత్తుల్లో భాగంగా కమలాపురంను సీపీఐకి కేటాయించారు. ఇంకా కడప, పులివెందుల, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇక నామినేషన్లు వేసేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు ముహూర్తబలాలు చూసుకొని నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జాతకం ప్రకారం రెండుమూడు సెట్లు నామినేషన్లు వేయనున్నారు. సీఎం జగన్ ఈనెల 25న పులివెందుల అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అదేరోజు పులివెందులలో బహిరంగ సభ పెట్టనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇక హోరాహోరీ

నామినేషన్ల ఘట్టం ప్రారంభమవడంతో ఇక అభ్యర్థులు హోరాహోరీ ప్రచారాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌లు ఎన్నికల ప్రచారాలను నిర్వహిస్తున్నాయి. మేమంతా సిద్ధం పేరుతో ప్రొద్దుటూరులో సభ నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రొద్దుటూరులో బహిరంగ సభ నిర్వహించారు. వైఎస్ షర్మిల కడప నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేపట్టి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇప్పటికే అగ్ర నేతలు జిల్లాలో తొలివిడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇక నామినేషన్ల తర్వాత మరోమారు అగ్రనాయకులు జిల్లాకు రానున్నారు. బీజేపీ తరఫున కేంద్ర మంత్రులు ప్రచారానికి వస్తున్నారని చెబుతున్నారు. అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించనున్నారు.

జన కేతనం

రాష్ట్రంలో కూటమిదే విజయం

- 24న రాజంపేటలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బహిరంగ సభ
- టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి వెల్లడి



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ జోనల్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు, సుగవాసి

రాజంపేట, ఏప్రిల్ 17: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అటు ఎంపీ, ఇటు ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ స్వీప్ చేస్తుందని తెలుగుదేశం పార్టీ జోనల్ ఇన్‌చార్జి దీపక్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం రాజంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 24 పార్లమెంటు స్థానాలు ఎన్‌డీఏ కూటమి కైవసం చేసుకుంటుందని సర్వేలు వచ్చాయని, మిగిలిన స్థానాన్ని కూడా గెలుచుకుని మొత్తం స్వీప్ చేస్తామన్నారు. ఈనెల 24వ తేదీ రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం నామినేషన్ దాఖలు చేస్తున్నారని, అదేరోజు సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజంపేట ఎన్నికల బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. రాజంపేటలో చిన్నచిన్న ఇబ్బందులను సర్దుబాటు చేశామని, టికెట్లు ఆశించి రాని వారంతా ప్రచారంలో పాల్గొని అధినేత ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటారన్నారు. రాజంపేటలో అసంతృప్తికి తావు లేదన్నారు. టీడీపీ అధినేత ప్రకటించిన సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుకు ఆయన సేవలను గుర్తించి సముచిత స్థానం ఇస్తామని తెలిపారు. జగన్‌మోహన్‌రాజు పార్టీ కోసం ఎంతో పాటుపడ్డారని, ఈ విషయం పార్టీ గుర్తించిందని, ఆయన కృషికి తగ్గట్టు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. రాజంపేటలో వైసీపీ నేతలు ఇప్పటికే భారీ ఎత్తున టీడీపీలో చేరారని, తిరిగి పెద్దఎత్తున కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ ప్రధాన నాయకులు, ఎంపీటీసీలు అధినేత వద్ద పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారన్నారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఎక్కడ చూసినా టీడీపీ ప్రభంజనం బలంగా వీస్తోందన్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, తాను ఎక్కడ పర్యటించినా నియోజకవర్గ ప్రజలు పార్టీలకతీతంగా ఆదరిస్తున్నారని, ఆదరించి నీరాజనాలు పలుకుతున్నారని, విజ్ఞులైన ప్రజలందరూ తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారని వెల్లడించారు. తాను 24వ తేదీ బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్నానని, అదేరోజు సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజంపేటలో జరిగే బహిరంగసభలో ప్రసంగించనున్నారని ఈ కార్యక్రమాలకు ప్రజలు వచ్చి తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా ముస్లింల బైఠాయింపు

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: స్థానిక వైసీపీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్యాలయం ఎదురుగా గేటు వద్ద జమ్మలమడుగు ముస్లింలు బైఠాయించారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి 7.35 గంటల వరకు బాధితులు కార్యాలయం వద్ద ఉన్నారు. వారు మాట్లాడుతూ మంగళవారం మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం కొత్తమసీదు సమీపాన జమ్మలమడుగుకు చెందిన గౌషియా మసీదు పీఠాధిపతిపై వైసీపీ నేత, కౌన్సిలర్ ముల్లా జానీ అసభ్యకర వాక్యలు చేశారని వారు ఆరోపించారు. ఇందుకు సంబంధించి వైసీపీ కార్యాలయం వద్ద బైఠాయించినట్లు తమ పీఠాధిపతిపై అనవసరమైన వాఖ్యలు చేయడాన్ని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డికి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, వైసీపీ నేత మల్కిరెడ్డి హనుమంతరెడ్డి తదితరులు ముస్లింలతో పీఠాధిపతి శిష్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు బాధితులు తెలిపారు. ముల్లాజానీతో మాట్లాడి క్షమాపణ చెప్పిస్తామని, ఒకవేళ చెప్పకపోతే పార్టీ నుంచి ఆయనను సస్పెండ్ చేస్తామని చెప్పినట్లు పీఠాధిపతి శిష్యులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి అంతా వెళ్లిపోయారు. సమస్యను తెలుసుకున్న వైసీపీ కార్యాలయం వద్దకు అర్బన్ పోలీసు స్టేషన్ సిబ్బంది ఎస్‌ఐ సుబ్బారావు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సమస్య నియోజకవర్గమంతా వ్యాపించినట్లు తెలుస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం గురువారం పరిష్కరిస్తామని చెప్పినట్లుగా బైఠాయించిన వారు తెలిపారు.



జమ్మలమడుగు వైసీపీ కార్యాలయం ముందు గేటువద్ద బైఠాయించిన ముస్లింలు

హామీలు బారెడు.. అమలు జానెడు

- సాక్షాత్తు సీఎం జగన్ హామీలకే తిలోదకాలు
- మళ్లీ గెలిపించాలంటూ వైసీపీ ఇంటింటి ప్రచారం
- ఇచ్చిన హామీల అమలు ప్రశ్నార్థకమే...
- ఇదీ బద్వేలు నియోజకవర్గ దుస్థితి

(కడప-ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు రూ.500 కోట్ల అభివృద్ధి అయితే జరిగిన పనులు మాత్రం రూ.47 కోట్లు మాత్రమే. ప్రతిపక్ష నేత హోదాలో చాంతాడంత హామీలు ఇస్తే ముఖ్యమంత్రి అయ్యాక అమలుకాక పోవడంతో హామీలు బారెడు... అమలు అన్నట్లుగా తయారైంది. 2004 నుంచి బద్వేలు నియోజకవర్గంలో కాంగ్రెస్, వైసీపీ అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. ఇక 2019, 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో సైతం వైసీపీ అభ్యర్థే గెలుపొందారు. అయితే ప్రతిపక్ష నేత, సీఎం హోదాలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోక అటు జనం, ఇటు రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారంలో ఉండి ఐదేళ్లు ఏం చేయలేకపోయారు. మళ్లీ ఇప్పుడు వైసీపీనే గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు ఇదేం చోద్యమని ముక్కున వేలేసుకుంటున్నారు ఓటర్లు.



బద్వేలులోని మహ్మద్‌కాలనీ రోడ్డు దుస్థితి

సోమశిలకు ఎగనామం

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది బద్వేలు, గోపవరం పరిస్థితి. గోపవరం పక్కనే సోమశిల ప్రాజక్టు ఉంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం గోపవరం మండలంలో ఊర్లన్నీ ఖాళీ చేశారు. అయితే చెంతనే నీరున్నా చుక్క కూడా ఉపయోగించలేని పరిస్థితి. సోమశిల నీటిని బద్వే లు పెద్దచెరువుకు నింపితే బద్వేలు, గోపవరం మండలాలకు సాగు, తాగునీటి సమస్య తీరుతుందని ఎప్పటి నుంచో ఆ ప్రాంతీయుల కల. సోమశిల నీటి కోసం ఆందోళనలు, పాదయాత్రలు, ఉద్యమాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ విజ్ఞప్తి మేరకు సోమశిల ప్రాజెక్టు నుంచి బద్వేలుకు నీరు ఇచ్చేందుకు 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక జీఓ ఇచ్చారు. పనులు పట్టా ఎక్కుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. నాడు ప్రతిపక్ష నేత హోదా లో జగన్ బద్వేలు నాలుగురోడ్ల కూడలి బహిరంగసభలో మాట్లాడుతూ మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సోమశిల నుంచి 2 టీఎంసీలు కాదు 5 టీఎంసీల నీటిని ఇస్తానని జనం సాక్షిగా హామీ ఇచ్చారు. అన్నట్లుగానే జగన్ సీఎం అవడంతో ఇక సోమశిల వాటర్ వస్తుందని జనం భావించారు. ఐదు టీఎంసీల నీరు వస్తే గోపవరం, బద్వేలులో సుమారు 25వేల ఎకరాలకు అటు నేరుగా, ఇటు బోరుబావుల ద్వారా నీరందుతుందని రైతులు సంతోషించారు. నాలుగురోడ్ల కూడలిలో జనం సాక్షిగా ఇచ్చిన హామీకి జగన్ మంగళం పాడించి ఎత్తిపోతల పథకాన్ని ఎత్తి సోమశిలలో పడేశాడు.

రూ.500 కోట్లతో బద్వేలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

2021 జూలై10న ఉప ఎన్నికల వేళ నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం అంటూ సీఎం జగన్ ప్రకటించారు. దీంతో బద్వేలు నియోజకవర్గం రూపురేఖలు మారుతాయంటూ బద్వేలులో జనం ఎదుటే అన్నారు. రూ.130.6 కోట్లతో చేపట్టే 140కి.మీ మేర సీసీ రోడ్లు,వాటిలో 104 కోట్లు మిగతా 26.6 కోట్లతో శ్మశానాలు, కూరగాయలు మార్కెట్ అభివృద్ధికి వాణిజ్య సముదాయాలు ఇతర పనులకు శంకుస్థాపన చేశారు. కలసపాడు, అట్లూరు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో ఆలయాల అభివృద్ధికి, వంతెనలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కడప జిల్లాకు ఎంత చేసినా తక్కువే. నన్ను ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. మీరు ఇచ్చిన చలువతోనే నేడు రాష్ట్రంలో తిరగగలుగుతున్నా, మీ ప్రేమ, ఆదరణ ఎప్పుడూ మరిచిపోలేనని ఊకదంపుడు ఉపన్యాసం బాగానేచేశాడు కానీ పనుల కోసం నిధులు విడుదల చేసి ఉంటే పనులు త్వరగా పూర్తయ్యేవి. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు వెళ్లలేదు. సీసీరోడ్లు కేవలం రూ.47 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కూరగాయల మార్కెట్, పార్కులు, శ్మశానల అభివృద్ధికి ఇచ్చిన హామీలు పూర్తి కాలేదు. నాగులచెరువును సుందరీకరణ చేపడతామన్నారు. ఆ హామీ అటకెక్కించారు.



కలసపాడు సమీపంలో ఇక్కడే వంతెన నిర్మాణం కోసం జగన్ 9.5 కోట్లతో శంకుస్థాపన చేసింది

జన కేతనం

దాహం దాహం

- బద్వేలులో తాగునీటి సమస్య నివారణకు టీడీపీ హయాంలో పెన్నా నుంచి వాటర్ స్కీం ద్వారా నీటిని అందించాలనుకున్నారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ ప్రాజెక్టును అటకెక్కించింది. బ్రహ్మంసాగర్ ద్వారా నీళ్లు ఇస్తున్నారు అయితే మూడురోజులకొకసారి వస్తుండడంతో జనం అవస్థలు పడుతున్నారు.
- పోరుమామిళ్లలో రూ.25 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టినా అవి ముందుకు సాగడంలేదు. అసంపూర్తి పనులతో జనం అవస్థలు పడుతున్నారు. మినీ మార్కెట్‌యార్డు పనులు పోరుమామిళ్లలో మధ్యలోనే నిలిచిపోయాయి.
- కాశినాయన మండలంలో 22 దేవాలయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అదీ నెరవేరలేదు. శిథిలావస్థకు చేరుకున్న బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలకు అదనపు గదులు ఇస్తామని హామీ ఇచ్చారు. నేటికీ కూడా హామీ నెరవేరలేదు. బికోడూరు మండలం గోవిందాయపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదీ నెరవేరలేదు. అట్లూరు మండలం వేమలూరు సగిలేరు మధ్య రూ.22 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి సీఎం జగన్ వేసిన శిలాఫలకం అలాగే నిలిచిపోయింది. ముంపువాసులకు ఇళ్లు, భూములు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అదీ అమలు కాలేదు. కుడికాల్వ పనులు పూర్తి చేసి అట్లూరుకు తెలుగంగ నీరు అందిస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. రాత్రి పూట సిద్దవటం మీదుగా కడప వెళ్లాలంటే చెక్‌పోస్టుతో ఇబ్బందిగా ఉంది. అత్యవసర సమయాల్లో అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం చెక్‌పోస్టు ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు అమలు కాలేదు. కలసపా డు నుంచి బ్రాహ్మణపల్లెకు వెళ్లే దారిలో సగిలేరు వంతెనపై రూ.9.5 కోట్లతో నిర్మించే బ్రిడ్జికి సీఎం జగన్ ఉప ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి పూర్తయితే కలసపాడులోని నాలుగు గ్రామాలు, ప్రకాశం జిల్లాలోకి కూడా రవాణా మెరుగు అవుతుందని చెప్పుకొచ్చారు. హామీ శిలాఫలకాలకే పరిమితమైంది.

అడుగుపడని వెలుగొండ

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో 25వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఆ ప్రాజెక్టు డిజైన్ చేశారు. 2004 ఎన్నికల్లో, 2009, 2019 ఎన్నికల్లో కూడా వెలుగొండ ప్రాజెక్టు నీరు తీసుకవస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకు అది కార్య రూపం దాల్చలేదు. వెలిగండ నీరు వస్తే తెలుగుగంగ జలాలకు అందని కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లోని గ్రామాలకు సాగునీరు అందుతుంది. అయితే హామీ ముందు కు పడలేదు. తెలుగుగంగ ప్రాజెక్టు పిల్ల కాల్వలు, ఇతర పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి కేవలం చెరువులు నింపి వాటి ద్వారా అందిస్తున్నారు.



బద్వేలులోని కూరగాయల మార్కెట్



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది.

-భద్రాచలం

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



హత్య కేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ తులసీరామ్

రాయచోటిటౌన్, ఏప్రిల్17: ఈడిగప ల్లె సమీప చిన్నచెరువులో జరిగిన కొండమర్ల ఈశ్వరయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. సుండుపల్లె మండలం పొలిమేరపల్లె గ్రామం ఈడిగపల్లె చిన్న చెరువులో జరిగిన ఈశ్వరయ్య హత్య కేసు వివరాలను రాయచోటి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెల్లడించారు. సుండుప ల్లె మండలం చిన్నగొల్లపల్లె పంచా యతీ పూజారివాండ్లపల్లె సమీపంలో ఈనెల 1వ తేదీ రాత్రి శ్రీచింతకోట మ్మ జాతర జరిగింది. జాతరకు సంబేపల్లె మండలం ప్రకాశ్ నగర్ కాలనీ వాసి కొండమ ర్ల ఈశ్వరయ్య వెళ్లాడు. ఈ క్రమంలో ఈడిగప ల్లె వద్ద చాందినీ బండి వద్ద డ్యాన్సులు చూ స్తున్న ఈశ్వరయ్యను గుంతరాచపల్లె వాసి బు జే రవీంద్రనాయుడు అలియాస్ రవి, ఈడిగపల్లెకు చెందిన కమలాపురం జ్ఞానేశ్వర్ అలియాస్ జాను రాత్రి మూడు గంటల సమయంలో ఈడిగపల్లె పక్కనే ఉన్న చిన్నచెరువులోకి తీసుకెళ్లి బండరాళ్లతో ముఖం, తల మీద కొట్టి చంపి అని వద్ద ఉన్న రూ.38,500 డబ్బు దొంగలించుకుపోయారు. ఈ విషయంపై మృతుడు ఈశ్వరయ్య తమ్ముడు కొండమర్ల చిన్నప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని నిందితుల కోసం గాలిస్తుండగా 16వ తేదీన రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా ఇచ్చిన సమాచారంతో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి చేసి రూ.29 వేలు స్వాధీనం చేసుకుని బుధవారం రాయచోటి కోర్టులో హాజరు పర్చగా కోర్టు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ తెలియజేశారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఛేదించిన రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్‌ను డీఎస్పీ అభినందించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ తులసీరామ్

కొనసాగుతున్న ఉద్రిక్తత

చిన్నమండెం, ఏప్రిల్17: శ్రీనివాసపురం వద్ద మంగళవారం ప్రారంభమైన గొడవతో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. వివరాల్లోకెళితే.... మంగళవారం సాయంత్రం 5 గంటలకు టీడీపీ, వైసీపీ సానుభూతి పరుల నడుమ ఘర్షణ తలెత్తి టీడీపీ వర్గీ యులపై వైసీపీ వర్గీయులు రాళ్ల దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేంద్ర బలగాలతో ఎస్ఐ రమేశ్‌బాబు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అయితే బుధవారం ఉదయం బాధితురాలు ఓర్సు లక్ష్మీకాంత బోరుబావి వద్ద నీటి కోసం వెళ్లగా అధికార పార్టీ గ్రామ స్థాయి నేత అండతో వైసీపీ సానుభూతి పరులు ఆమెను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. వెంటనే ఆమెను రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంత జరుగుతున్నా ఇక్కడ ఎలాంటి గొడవ జరగలేదని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేశ్‌బాబు వివరణ ఇవ్వడం కొసమెరుపు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గస్తీ కాస్తున్నామే తప్ప గొడవలు జరగడం లేదని ఎస్ఐ మాట దాటవేస్తున్నారు.



ఓర్సు లక్ష్మీకాంతను కొడుతున్న దృశ్యం

సివిల్స్‌లో హరిప్రసాద్‌కు 475వ ర్యాంకు

రాజంపేట టౌన్, ఏప్రిల్17: రాజంపేట మండలం ములక్కాయలపల్లె వాసి కడుమూరి హరిప్రసాద్‌రాజు సివిల్స్‌లో 475వ ర్యాంకు సాధించారు. జాతీయ స్థాయిలో 475వ ర్యాంకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. హరిప్రసాద్‌రాజు తల్లి వెంకటసుబ్బమ్మ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారని, తండ్రి నాగేంద్రవర్మ టీచర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందారు. రాజు చెల్లెలు చందన ఎంబీబీఎస్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. మరో చెల్లెలు ఖరగ్‌పూర్‌లో ట్రిపుల్‌ఐటీ చదువుతున్నారు.



మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్ ఖైదీ మృతి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17: మదనపల్లె స్పెషల్ సబ్‌జైలులో రిమాండు ఖైదీ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆర్డీఓ హరిప్రసాద్ మెజిస్టీరియల్ విచారణ చేపట్టారు.

చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం ముత్తుకూరు వాసి పాపన్న కుమారుడు మెగిలప్ప(67) నాటుసారా విక్రయిస్తున్నాడని పోలీసులు ఈనెల 16న అరెస్టు చేసి పలమనేరు కోర్టు ఎదుట హాజరు పరచగా కోర్టు రిమాండు విధించిది. పోలీసులు మదనపల్లె సబ్‌జైలుకు మంగళవారం సాయంత్రం 5.30గంటలకు తీసుకొచ్చారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పరిశీలించిన సబ్ జైలు సిబ్బంది మొగిలప్పను జైలు బ్యారెక్‌లోకి పంపారు. కాగా బుధవారం మొగిలప్ప అపస్మారక స్థితిలో పడి ఉండడంతో జైలు సూపరింటెండెంట్ రామకృష్ణయాదవ్, సిబ్బంది అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మొగిలప్ప మృతిచెందాడని నిర్ధారించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, మాలమహానాడు నేతలు ఆస్పత్రి వద్ద మొగిలప్ప కుటుంబీకులను విచారించారు.



మొగిలప్ప మృతదేహం

వివేకా హత్య ఆ ఇద్దరికి ముందే తెలుసు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేస్తారనే విషయం వైఎస్ జగన్ ఆయన భార్య భారతిరెడ్డిలకు ముందే తెలుసునని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జమ్మలమడుగు ఎన్డీయే కూటమి అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వివేకా హత్య మార్చి 15న జరుగుతుందని జగన్‌రెడ్డికి, భారతిరెడ్డి, అవినాశ్‌రెడ్డికి ముందే తెలుసన్నారు. ఆ రోజున తాను ప్రొద్దుటూరులో ప్రచారంలో ఉన్నప్పుడు వివేకానందరెడ్డి బంధువైన శివప్రకాశ్‌రెడ్డి, ధనిరెడ్డి శేఖర్‌రెడ్డి ఫోన్ చేసి హత్యగురించి చెప్పారన్నారు. అదే రోజు శివప్రకాశ్‌రెడ్డి కుమారుడు రోహిత్ కూడా చెప్పారన్నారు. వివేకా ఎక్కువగా సిగరెట్లు తాగుతారని, వాంతికి చేసుకుని చనిపోయాడని తర్వాత గుండెపోటు అని, ఇవన్నీ జగన్ టీవీ చానల్‌లోనే చెప్పిన రెండు గంటల తర్వాత తాము ఈ విషయాలను మాట్లాడుకున్నామని ఆదినారాయణరెడ్డి తెలిపారు. విజయసాయిరెడ్డి కూడా గుండెపోటు అని, వారి టీవీలోనే ప్రచారం చేశారన్నారు. ఆరోజు సిట్ బృందం తనను విచారణ చేసినప్పుడే ఈ విషయాలన్నీ వారికి చెప్పానన్నారు. తర్వాత జగన్ మేనమామ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తనపై కేసు మోపాడన్నారు. చేసిందంతా చేసి వారి తప్పులు బయటకు రాకూడదని చంద్రబాబు ఆధ్వర్యంలో తాను, బీటెక్ రవి, ప్రస్తుతం వైసీపీలో ఉన్న మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి కలిసి వివేకాను చంపినట్లు తమపై వార్తలు రాశారన్నారు. వివేకా హత్యకు సంబంధించిన వివరాలన్నీ సీబీఐ వద్ద ఉన్నాయన్నారు.


రాయచోటి రెడ్డీస్‌కాలనీ రామాలయంలో సీతారాముల కల్యాణం


కోడూరు కోదండరామాలయంలో భక్తుల పూజలు


చిట్వేలి కోదండరామాలయంలో..


ఇసుకపల్లెలో సీతారాముల కల్యాణం

కమనీయం.. సీతారాముల కల్యాణం..

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం రాయచోటి పట్టణంలోని రెడ్డీస్ కాలనీ రామాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో తిరుమల వేద పాఠశాల పండితులు సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వారికి అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయం నుంచి కల్యాణ మండపం వరకు బ్యాండు మేళాలు, కోలాటాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు గణేశ్ బోర్‌వెల్స్ యజమాని బిత్తిరాల ఉషారాణి, వెంకట్రామిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కన్నుల పండుగగా కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణంను వీక్షించేందుకు వచ్చిన భక్తులకు 12వ వార్డు కౌన్సిలర్ మురికినాటి లక్ష్మిదేవి, వెంకట్రామిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కావలి వెంకటసుబ్బారెడ్డి, రాజారెడ్డి, అంగడి సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సాయిరాం, సుబ్బరామయ్య, వెంకట్రామరాజు, గుడి రాజా, పీరయ్య, హోటల్ మల్లికార్జున, మెడికల్ స్టోర్ హరినాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మండలంలోని బయనపల్లె కోదండరామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, సీనియర్ నేత కట్టా బాలాజీ, టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం సాధించాలని ముక్కా రూపానందరెడ్డి, ఆయన సతీమణి వరలక్ష్మీ పూజలు చేయించారు.

చిట్వేలి: స్థానిక కోదండరామాలయంలో ఉదయం ధ్వజారోహణం అభిషేకం, పూజలు చేశారు. బ్రాహ్మణ వీధిలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఉదయం పూజలు చేసి సాయంత్రం శ్రీరామచంద్రుని చిత్రపటాన్ని ఊరేగించారు.

నందలూరు : ఇసుకపలి, కుమ్మరపల్లి, ఆల్విన్ ఫ్యాక్టరీ సమీపంలోని ఆలయాల్లో కల్యాణోత్సవం నిర్వహించారు. ఇసుకపల్లెలో బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా పసుపులేటి సుబ్రమణ్యం దంపతులు, పసుపులేటి దుర్గా ప్రవీణ్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. కుమ్మరపల్లెలో ఎల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు విందు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలలో మాజీ జెడ్పీటీసీ ఎల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ ఎద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలో అర్చకుడు నారాయణవర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. భరణికుమార్, సుహాసిని, చైతన్య కుమార్‌రెడ్డి, శ్రీలతరెడ్డి ,పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నదానం చేశారు. రామచంద్రారెడ్డి, సూరుడునాయక్, అద్దాల శ్రీనివాసులు, వెంకటరమణ, టైపిస్టు వెంకటరమణ, సురేష్ ,తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: బండపల్లె సమీపంలోని కమ్మరాయునికొండ వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ఇండియన్ గ్యాస్ అధినేత సీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. సద్గురు దర్బార్ సాయి నగర్‌లోనే ఉత్సవాలను నిర్వహించారు.

పెనగలూరు: మండలంలోని అత్తిగారిపల్లె దేవాలయంలో హైదరాబాదుకు చెందిన నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించా. అనంతరం అన్నసంతర్పణ చేశారు

గాలివీడు: గాలివీడు, అరవీడు, నూలివీడు, చీమలచెరువుపల్లె, పూలుకుంట, బోరెడ్డిగారిపల్లె పంచాయతీల్లోని రామాలయంలో సీతారాములకు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

రాజంపేట టౌన్: పట్టణంలోని కొలిమివీధి, నూనెవారిపల్లె రోడ్డు, మన్నూరు, రామ్‌నగర్, బోయపాలెం, ఈడిగపాలెం, నూనెవారిపల్లె, కూచివారిపల్లె, భువనగిరిపల్లెల్లో ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పుల్లంపేట : పుల్లంపేట మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం పూజలు, అభిషేకాలు చేసి, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి అవ్వారు నరసింహులు అధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించి అన్నసంతర్పణ చేశారు.

బీ ఫాం అందుకున్న జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్


బీ-ఫాం అందుకుంటున్న అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17: శ్రీరామనవమి సందర్భంగా జనసేన అధినేత పవన్‌కల్యా ణ్ రాష్ట్ర వ్యాప్తంగా తన పార్టీ అభ్యర్థులకు బీ-ఫాంలను అం దించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరులో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ బుధ వారం బీ-ఫాంను అందుకున్నా రు. జనసేన అభ్యర్థులు అందరూ విజయాలు సాధించాలని పవన్ కళ్యాణ్ కోరుకున్నారని అభ్యర్థి శ్రీధర్ తెలిపారు.

వాటర్ ప్యూరిఫయర్ విరాళం

సుండుపల్లె, ఏప్రిల్ 17: సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి కటారుముడుకుకు చెందిన కన్యాకుమారి వేణుగోపాల్ కుటుంబ సభ్యులు బుధవారం వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్లు ఆలయ అర్చకుడు అమ్మునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం నిర్వహించి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్యం సీసాల పట్టివేత

రాయచోటి టౌన్, ఏప్రిల్ 17:కొత్తపేట రామాపురంలోని వెలగచెట్టు వద్ద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం ఎస్‌ఐ భక్తవత్సలం పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి షేక్ ఖాదర్‌బాషా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

రాజంపేట వైసీపీ ఖాళీ!

- నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిక
- 30 వాహనాల్లో మరికొందరు హైదరాబాదుకు..
- డైరెక్టర్ పదవులకు ముగ్గురి రాజీనామా

రాజంపేట, ఏప్రిల్17 : రాజంపేటలో వైసీపీకి మరోషాక్ తగిలింది. ఇప్పటికే నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రధాన నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోగా బుధవారం మరికొందరు విజయవాడలో లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు పోలి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం టీడీపీ అధినేత సమక్షంలో టీడీపీ చేరడానికి 30 వాహనాల్లో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అనుచరులు రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బుధవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. బుధవారం సాయంత్రం నారా లోకేష్ విజయవాడలోని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రాజుతో పాటు, పలువురు క్షత్రియ సంఘం నాయకులు, బీసీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రముఖ మైనారిటీ నాయకులు గుల్జార్‌బాషా, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ భువనబోయిన లక్ష్మీనరసయ్య, నందలూరుకు చెందిన వక్ఫ్‌బోర్డు కార్యదర్శి అమీర్‌బాషాతమ పదవులకు రాజీనామాలు చేసి హైదరాబాదుకు పయనమయ్యారు.


నారా లోకేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న కొండూరు శరత్‌కుమార్‌రాజు తదితరులు

వైసీపీ పాలన అసమర్థతకు నిదర్శనం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు

సుండుపల్లె, ఏప్రిల్ 17: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అసమర్థ పాలనకు నిలువెత్తు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. బుధవారం సుండుపల్లె మండల కేంద్రంలోని జనార్దన్‌రెడ్డినగర్, ఇందిరానగర్, అరెమ్మవీధితో పాటు పలు వీధుల్లో టీడీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ కటారుముడుకుకు చెందిన 20 కుటుంబాలు, మడితాడు గ్రామ పంచాయతీకి చెందిన 15 మైనార్టీ కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, చప్పిడి రమేష్‌నాయుడు, యూనియన్ బాషా, మేకల మహబూబ్‌బాషా, దామోదర్‌నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, రామాంజులు, వెంకట్రమణ, మాలేపాటి సురేశ్‌నాయుడు, ప్రసాద్‌రాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌నాయక్, ఎస్సీ సెల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, రామాశ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


కటారుముడుకు గ్రామస్తులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌బాబు

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ఒంటిమిట్ట, ఏప్రిల్17 : కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం బమ్మెరపోతన జన్మదినాన్ని పురస్కరించుకొని హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ దత్సహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యుల రవి పాల్గొన్నారు. పసుపులేటి శంకర్ పురాణం, నారాయణ రెడ్డి గజేంద్రుని ఆక్రందన డాక్టర్ నీలవేణి రంతి దేవుని చరిత్ర, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, భాస్కర రామాయణంలోని శివధనుర్భంగం, సీతాదేవి కల్యాణం, ఎం.శివారెడ్డి కుచేలో పాఖ్యానంపైన కవిత్వాన్ని చెప్పారు.

నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని రైల్వేకోడూరు ఎన్నికల అధికారిణి లీలారాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 27, 28, 29 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. డీఎస్పీ బాబూజీ నోడల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తారన్నారు. హెచ్ఎంఎం హైస్కూలు అవతలి వరకు ప్రజలకు తర్వాత వంద మీటర్ల నుంచి నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు, ప్రతిపాదకులు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఎన్నికల సెల్ అధికారిగా సీఐ మధుసూదన్‌రెడ్డి వ్యవహరిస్తారన్నారు.

రాజంపేట : రాజంపేట నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అధికారి టి.మోహన్‌రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 26వ తేదీ నుండి 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.

'టీడీపీకి అండగా నిలవండి'


ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడుతో రాయచోటి నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17: రాజంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా బుధవారం పాతరాయచోటి నేతలు రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో పలువురిని కలిసి టీడీపీకి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మి ప్రసాద్, పాతరాయచోటి శివాలయం ధర్మకర్త భక్తవత్సలం, కమిటీ సభ్యులు మడ్ల సుదర్శన్ తదితరులు నందలూరులో ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిసి తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. నందలూరులోని పలువురు నేతలను కలిసి టీడీపీకి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

కోదండరాముడి సన్నిధిలో 'చమర్తి'


కోదండరామున్ని దర్శించుకున్న అనంతరం ఒంటిమిట్టలో జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 17 : శ్రీ రామనవమి సందర్భంగా రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు బుధవారం ఒంటిమిట్టలోని కోదండ రాముడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాములవారి ఆశీస్సులతో పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర భవిష్యత్తు ఎన్‌డీఏ కూటమితోనే సాధ్యమని వ్యాఖ్యానించారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు ఎంపీ స్థానాన్ని కూడా గెలవబోతున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యం నాయుడు, రాజంపేట మండలపార్టీ అధ్యక్షుడు సతీష్‌రాజు, సీనియర్ నాయకులు కోటయ్య నాయుడు, పార్లమెంటు టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పోలిశివకుమార్, జి.వి.సుబ్బరాజు, సింగన పరశురాం నాయుడు, సూర్యనారాయణరాజు, మామిళ్ల శ్రీహరి, మైనారిటీ నాయకులు రంతు, బొడిచెర్ల శ్రీనివాసులు, చౌడయ్య, లక్ష్మీరెడ్డి శరత్‌రెడ్డి, గంగిరెడ్డి, యల్లయ్య, వెంకట్రామిరెడ్డి, గోపాల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర యువకులను తక్షణం విడుదల చేయాలి



వడ్డెర యువకుల అరెస్టుపై నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్17: స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గులకరాయి డ్రామాలు ఆడున్నాడని, పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్న వడ్డెర యువకులను తక్షణం విడుదల చేయాలని అన్నమయ్య జిల్లా ప్రజా సంఘా ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బుధవారం సాయంత్రం వేదిక ఆధ్వర్యంలో గులకరాయి డ్రామాపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓపీడీఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టీ. ఈశ్వర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ వడ్డెర కులానికి చెందిన సతీష్‌తో పాటు, కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేస్తూ చేయని నేరాన్ని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వడ్డెర పిల్లలకు ముఖ్యమంత్రిపై కక్షగట్టి గులకరాయి విసరాల్సిన అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన ముఖ్యమంత్రి సానుభూతితో అధికారంలో రావాలని చూస్తున్నాడని, అందులో భాగంగానే గులకరాయి డ్రామా ఆడుతన్నారని విమర్శించారు. 2019 లో కోడి కత్తి శ్రీనును బలి చేసి ఐదేళ్ల పాటు బెయిల్ రాకుండా చేసి క్షమించరాని నేరం చేశాడని ఈ రకమైన చర్యలను రాష్ట్ర ప్రజలు క్షమించరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక నాయకులు జీవానందం, చంద్రశేఖర్, మరుతీశంకర్, రజక సంఘం నాయకులు రమేశ్‌బాబు, శ్రీనివాసులు, కంచపు రె డ్డెయ్య, రామకృష్ణ, దేవరాజులు, శ్రీనివాసులు, పల్లపు శ్రీను, పామయ్య, కురపోతుల రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కూసాలు కదిలేలా ప్రచారం'


బయనపల్లెలో ప్రచారం చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17: కూటమి ప్రచారం వైసీపీ కూసాలు కదిలేలా వినిపిసాయని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని బయనపల్లె, ఓబనపల్లె, దళిత వాడ, అరుంధతివాడల్లో, ఎర్ర మిట్ట కాలనీ కూటమి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసే రోజు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ గెలుపును ఎవరు ఆపలేరన్నారు. బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం ఖాయమన్నారు. టీడీపీ నాయకులు కట్టా బాలాజీ, గడికోట సుబ్బరాయుడు, రాజేంద్రబాబు, ఈశ్వరయ్య నాయుడు, ప్రేమ్‌చంద్, వినోద్‌కుమార్, కస్తూరి రాజయ్యనాయుడు, సుబ్బయ్యగారి చంద్ర, బాలునాగేంద్ర, గడికోట మోహన్‌సాయి, గడికోట మధు, పోలిన గణేష్, చంద్రశేఖర్, కస్తూరి సుబ్బరాయుడు, కస్తూరి చంద్ర, గడికోట రాజేంద్ర, నారాయణ, యశ్వంత్, నాగేశ్వర, కూకట్ల ఈశ్వరయ్య, లలితమ్మ, నాగభూషణం, నాగేశ్వర, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి,కొరముంచి సంయుక్త, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నగిరిపాడు రామాలయానికి రథం సమర్పణ


రథాన్ని సమర్పించిన పెరియవరం యతీష్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

చిట్వేలి, ఏప్రిల్17 : చిట్వేలి మండలం నగిరిపాడు రామాలయానికి శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా బుధవారం పెరియవరం కుటుంబ సభ్యులు 4లక్షల రూపాయలు విలువ చేసే రథాన్ని ఆలయానికి సమర్పించారు. ఆ గ్రామ నాయకులు పెరియవరం పెద్ద రామిరెడ్డి, పెరియవరం సుబ్బారెడ్డిల జ్ఞాపకార్థం పెరియవరం యతీష్ కుమార్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఈ రథాన్ని ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు కురవి విశ్వనాధకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన రథంపై సీతా రామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాదాలపై పెట్రోల్ బంకుల సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని రాయచోటి అగ్నిమాపకశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం కడప రోడ్డులోని పెట్రోల్ బంకు సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బందితో పాటు పెట్రోల్ బంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మైనార్టీల ప్రచారం


అగ్రహారంలో ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకులు

సుండుపల్లె, ఏప్రిల్17: రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి రాజంపేట నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అఖండ మెజార్టీతో గెలిపించాలని రాయచోటికి చెందిన ముస్లిం మైనార్టీలు పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేట పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి మయానా ఇర్షాద్‌అలీఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం నేతలు సుండుపల్లె, మడితాడు, జీకేరాచపల్లె, రాయవరం, తిమ్మసముద్రం, గూగుట్‌పల్లి, బెస్తపల్లి, నడిమి తురకపల్లె, సుండుపల్లె మండల కేంద్రంలో ప్రతి మైనార్టీ కుటుంబాన్ని కలిసి సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం తెలుగు యువత మండల అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్, మైనార్టీ నాయకులు దర్బార్‌బాషా, కరామత్, ఫారుక్, వాజిద్, రెడ్డిబాషా, మహబూబ్‌బాషా, ఫయాజ్, బర్కత్, సాదిక్‌తో పాటు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా: మండిపల్లి

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 17: తెలుగుదేశం పార్టీని అత్యంత మెజార్టీతో గెలిపిస్తే, సమస్యలన్నీ పరిస్కారిస్తానని రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాదురెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన అనంతపురం గంగమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ కార్యాలయాల మిట్ట నుంచి ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు గాజుల ఖాదర్‌బాషా, రమేష్‌రెడ్డి, డాక్టర్ షఫీనాయక్, ముక్తార్, ఆరీఫ్‌బాషా, మండ్లరామాంజనేయులు, మూగివెంకటరమణ, అంజాద్‌భాషా, సుదర్శన్ బాబు, బాబుల్‌రెడ్డి, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్ మోహన్ రెడ్డి లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి

చిన్నమండెం, ఏప్రిల్17: 11 కేవీ విద్యుత్ వైర్లు తెగి రెండు గొర్రెలు మృతి చెందగా 13 గొర్రెలకు గాయాలైనట్లు గొర్ల కాపరి పేరంపల్లె మల్లయ్య తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో గుట్టకిందపల్లె నుంచి ఆదెం చెరువు మేకమాను చెరువుకు వెళ్లేదారి గుండా గొర్రెలను తోలుకొని పోతుండగా అక్కడ తెగి పడిపోయిన 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి 2 గొర్రెలు మృతి చెందాయని, 3 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయని మరో ఎనిమిది గొర్రెలకు స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఈ విషయంపై . ఏఈ రాజేశ్ మాట్లాడుతూ ఇన్సులేటర్ తెగిపోయినట్లు సమాచారం వచ్చిన వెంటనే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నామినేషన్లకు సబ్ కలెక్టరేట్ సిద్ధం

● నిబంధనలు వెల్లడించిన రిటర్నింగ్ అధికారి



నాలుగు కౌంటర్లతో నామినేషన్ స్వీకరించే రిటర్నింగ్ అధికారి గది వద్ద పూర్తి చేసిన ఏర్పాట్లు

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 17: మదనపల్లె నియోజకవర్గం (164 అసెంబ్లీ నియోజకవర్గం)కు సంబంధించి సాధారణ ఎన్నికల నామినేషన్ పర్వానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారి, నలుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు నామినేషన్ ప్రక్రియ మొత్తం పూర్తిగా వెబ్‌క్యాస్టింగ్ చేసేందుకు సీసీ కెమెరాలు, టీవీలు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఆదివారం సెలవు రోజు తప్ప మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే నామినేషన్ హాల్లోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థి ఫారం-26 అఫిడవిట్‌తో పాటు అవసరమైన పత్రాలు జత చేయాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఒక్కొక్క ప్రతిపాదకులు, బలపరిచేవారు ఉండాలని, స్వతంత్ర్య అభ్యర్థులు పది మంది ప్రతిపాదకులు, బలపరిచేవారు ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియ మొత్తం వీడియో, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని, వెబ్‌క్యాస్టింగ్ కూడా ఉంటుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు పబ్లిక్ డొమైన్‌లో, నోటీసు బోర్డులో నామినేషన్‌లకు సంబంధించి వివరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. సబ్‌కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి 100 మీటర్ల వరకు నిషిద్ధ ప్రాంతంగా పరిగణిస్తామన్నారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తారని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు రమాదేవి, బాలాజి రాజు, శ్రీనివాసులు, ప్రమీల పాల్గొన్నారు.

ఐదుగురికే అనుమతి : ఆర్‌ఓ



రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: నామినేసన్లు వేసేందుకు అభ్యర్థి సహా ఐదుగురికే అనుమతులు ఉంటాయని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18వ తేదీ గురువారం నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థి వంద మీటర్లలోపు గేటు వద్ద ఆగాలని అక్కడి నుంచి అభ్యర్థి సహా ఐదుగురికి మాత్రమే లోనికి అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్లు వేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జనరల్ కేటగిరీ వారికి రూ.10 వేలు చలానా, నగదు రూపంలో కానీ నామినేషన్ వేసే చోట ఇవ్వవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలకైతే అయిదు వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థులు రాష్ట్రంలో ఎక్కడివారైనా వారికి ప్రతిపాదన చేసే వారు సుమారు పది మంది స్థానికులే ఉండాలన్నారు. నామినేషన్లు ఆన్‌లైన్ ద్వారాకూడా వేయవచ్చని ఆయన తెలియజేశారు.

నరకదారులు...

● వైసీపీ ప్రభుత్వంలో రోడ్లన్నీ ఛిద్రం
● ఒక్క రోడ్డుకు మరమ్మతులు చేయలేదు
● అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
● నిధులు లేక ఆగిన రోడ్ల పనులు
● అవస్థల్లో వాహనదారులు, ప్రయాణికులు
● నాలుగేళ్లుగా సాగుతున్న రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల పనులు
● పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



కంకర తోలి అలాగే వదిలేసిన రాయచోటి-సుండుపల్లె రోడ్డు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17: జిల్లా పరిధిలోని ఇటు రాయచోటి నియోజకవర్గం, అటు రాజంపేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఆ రెండు రోడ్ల పనులు అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నాలుగు సంవత్సరాలుగా జరుగుతూనే ఉన్నాయి దీంతో ప్రయాణికులకు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నరకానికి దారులుగా మారిన రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ఈ ప్రాంతాల ప్రజలతో పాటు ప్రయాణికులు, వాహనదారుల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు సంవత్సరాల క్రితం రాయచోటి-సుండుపల్లె రోడ్డుతో పాటు రాయచోటి- సానిపాయి రోడ్లను డబుల్ లేన్‌లుగా మార్చాలని సంకల్పించింది. రాయచోటి నుంచి సుండుపల్లె వరకు డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.40 కోట్లు, రాయచోటి-సానిపాయి రోడ్డు మార్గంలోని షికారుపాలెం నుంచి సానిపాయి వరకు డబుల్‌లేన్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఆర్అండ్‌బీ శాఖ ద్వారా పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే నాలుగు సంవత్సరాల క్రితం ఆ పనులను పొందిన కాంట్రాక్టర్లు అధికారుల అలసత్వాన్ని, ప్రజాప్రతినిధుల అండదండలను ఆసరాగా తీసుకుంటూ రోడ్డును ఒకవైపు ఉంచి మరోవైపుకు చివర వరకు పనులు చేయకుండా రోడ్డు ఎక్కడ పడితే అక్కడ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తూ ప్రయాణికులు, వాహనదారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా రాయచోటి-సుండుపల్లె మార్గంలోని కుమ్మరపల్లి సమీపంలో కూడా ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు ఎక్కడ పడితే అక్కడ పనులను చేస్తూ రోడ్డుపై కంకర తోలి అలాగే వదిలేయడంతో పాటు అనుంపల్లె అటవీ ప్రాంతంలో అటవీ అనుమతులు లేవంటూ పనులను పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో వర్షాలకు రోడ్డుకి రువైపులా కోతలకు గురై బస్సులు, వాహనాలు తొలగాలంటేనే నానా అవస్థలు పడే పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. అందులోనూ ఒకవైపు నుంచి రోడ్డు పనులు పూర్తిగా చేయకుండా వారికి ఎక్కడ సులభతరంగా ఉంటే అక్కడ పనులు చేస్తూ కష్టతరంగా ఉన్నచోట, కల్వర్టులు ఉన్న చోట అలాగే వదిలేయడంతో ఆ రోడ్డులో ప్రయాణించాలంటేనే ప్రయాణికులకు నరకం కనబడుతోంది. దీనికి తోడు అటవీశాఖ అనుమతులు వచ్చినప్పటికీ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చేపట్టకపోవడంతో అక్కడ సింగిల్ రోడ్డు వలన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక శిబ్యాల సమీపంలో ఈదుల వంకపై ఉన్న పాత కల్వర్టు స్థానంలో కొత్త బ్రిడ్జిని ఏర్పాటు చేసే క్రమంలో పిల్లర్స్ వేసి అలాగే వదిలేయడం వలన పాత బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రయాణికులు, వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగు సంవత్సరాలుగా రోడ్డు పనులు సక్రమంగా చేయకుండా అక్కడక్కడా కంకర తోలి అలాగే వదిలేయడం వలన రాత్రి సమయాల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డు పని కూడా పూర్తి చేయలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లే తప్ప ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డుకు మరమ్మతులు చేసిన పాపాన పోలేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతుకుల రోడ్లలో ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడే ప్రమాదం జరుగు తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

అలాగే రాయచోటి-సానిపాయి మార్గంలోని షికారుపాలెం నుంచి సానిపాయి వరకు డబుల్‌లేన్ రోడ్డు పనులు నాలుగు సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయి. ఆ మార్గంలో శీతంపేట వద్ద కొంత దూరం జంగంపల్లి వద్ద కొంత దూరం సానిపాయి సమీపంలో కొంతదూరం అక్కడక్కడా రోడ్డు పనులు చేపట్టి మిగిలిన చోట్ల కంకర తోలి అలాగే వదిలేయడం వలన వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అలాగే షికారుపాలెం నుంచి శీతంపేట వరకు మూడు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వలన రోడ్డుకు ఇరువైపులా వర్షానికి సింగిల్ రోడ్డు కోతకు గురికావడంతో బస్సులు క్రాస్ అయ్యే సమయంలో ఇబ్బందులు పడుతూ డ్రైవర్లు వాహనాలను నడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతేగాక కొత్తరోడ్డు, కొత్తపల్లి, కంకర మిషన్ ప్రాంతాల్లో కంకర తోలి అలాగే వదిలేయడం వలన ఆ ప్రాంతంలో ప్రయాణికులతో పాటు ద్విచక్రవాహనదారులు కూడా ఆ దారిన ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో పాటు ఆర్అండ్‌బీ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం వలన ఈ రోడ్లలో ప్రయాణించాలంటే నరకం చూడక తప్పడం లేదని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. నిర్దేశించిన గడువులోగా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకపోయినప్పటికీ వారిని తొలగించి ఆ స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించకుండా ఆర్అండ్‌బీ అధికారులు కూడా తమకు ఎందుకు వచ్చిన తంటలే అనే విధంగా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు వాహనదారులే తిప్పలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులతో పాటు అధికార పార్టీ నేతలు ప్రత్యేక చొరవ చూపి నరకదారులుగా మారిన రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి రోడ్ల నిర్మాణం పనులను పూర్తి చేసి ప్రమాదాల బారి నుంచి తమను కాపాడాలంటూ ప్రయాణికులతో పాటు వాహనదారులు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్అండ్‌బీ డీఈ వివరణ

జిల్లా కేంద్రమైన రాయచోటి పరిధిలోని రాయచోటి-సుండుపల్లె, రాయచోటి-సానిపాయి మార్గాల్లోని డబుల్ లేన్ రోడ్ల పనులు ఆలస్యంగా జరుగుతున్న విషయంపై ఆర్అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా పనులకు సంబంధించి ఆరు నెలల క్రితం కొంతమేరకు పార్ట్ బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన పనులకు సంబంధించి నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. అలాగే సుండుపల్లె రోడ్డు, సానిపాయి రోడ్ల మార్గంలోని అటవీ ప్రాంతంలో కూడా రోడ్ల నిర్మాణానికి అనుమతులు కూడా వచ్చాయన్నారు. నిధులు మంజూరైన వెంటనే ఆ రోడ్ల పనులను పూర్తి చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.





రాయచోటి-సానిపాయి రోడ్డులో కంకర తోలి అలాగే వదిలేసిన దృశ్యం, రాయచోటి-సుండుపల్లె మార్గంలోని శిబ్యాల వద్ద పిల్లర్లు వేసి అలాగే వదిలేసిన బ్రిడ్జి, అనుంపల్లె అటవీ ప్రాంతంలో కోతకు గురైన రాయచోటి-సుండుపల్లె రోడ్డు

మోగనున్న ఎన్నికల నగారా

● నేటి నుంచి 25 వరకు నామినేషన్లు
● కడప పార్లమెంటు అభ్యర్థులు కలెక్టరేట్‌లో..
● అసెంబ్లీ అభ్యర్థులు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో
● 20న షర్మిల నామినేషన్
● పులివెందుల అసెంబ్లీ నుంచి 25న జగన్ నామినేషన్
● టీడీపీ, వైసీపీ అభ్యర్థుల జాబితా సిద్ధం



కడప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రి య గురువారం నుంచి మొదలు కానుంది. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఉదయం 11 నుంచి ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు ప్రకటించారు. ఇక సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను వైసీపీ, టీడీపీ ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కడప పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పోటీ చేయనున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిల పోటీ చేస్తున్నారు. పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులు కడపలోని కలెక్టరేట్‌లో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంది. ఇక అసెంబ్లీ అభ్యర్థులు ఆయా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లను దాఖలు చేయనున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం ఓటర్లు 16,21,760 మంది ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగనుంది.

నామినేషన్లు...

ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. గుర్తింపు పొందిన రాష్ట్ర లేదా జాతీయ పార్టీ అభ్యర్థి కోసం అదే నియోజకవర్గం నుంచి ఒక ఓటర్ ప్రతిపాదిస్తే సరిపోతుంది. గుర్తింపు లేని పార్టీ, స్వతంత్ర్య అభ్యర్థి పోటీ చేస్తే అదే నియోజకవర్గం నుంచి పది మంది ప్రతిపాదించాలి. నామినేసన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి 100మీటర్ల దూరం పరిధిలోకి మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

నామినేషన్లు ఎక్కడెక్కడంటే...

కడప పార్లమెంటుకు సంబంధించి కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని సి-బ్లాక్‌లో నామినేషన్ దాఖలు చేస్తారు. కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలకు కు సంబంధించి ఆర్డీఓ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరుకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఇక ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు జనరల్ అభ్యర్థులు అయితే రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12500 దరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేకు పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.10, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5వేలు దరావత్తు చెల్లించాలి.

నేటి నుంచి నామినేషన్లు

నోటిఫికేషన్ విడుదల	16.3.2024
నామినేషన్ దాఖలు	18.4.2024,
ఆఖరు తేది	25.4.2024
నామినేషన్ల పరిశీలన	26.4.2024
ఉపసంహరణ	29.4.2024
అదే రోజు పోటీ అభ్యర్థుల ప్రకటన	
పోలింగ్ తేది	13.5.2024
కౌంటింగ్	04.6.2024

అభ్యర్థులు సిద్ధం

సార్వత్రిక ఎన్నికల్లో తలపడే అభ్యర్థులను టీడీపీ, వైసీపీ ప్రకటించింది. కూటమి పరంగా జమ్మలమడుగు, బద్వేల్‌ను బీజేపీకి కేటాయించగా మిగిలిన చోట్ల టీడీపీ బరిలో ఉంది. ఇక వైసీపీ సిట్టింగ్‌లందరికి మళ్లీ టికెట్ ఇచ్చింది. ఇక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల కడప పార్లమెంట్ నుంచి పోటీచేస్తున్నారు. ఈనెల 20న నామినేషన్ దాఖలు చేయనున్నారు. బద్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా విజయజ్యోతిని ప్రకటించారు. పొత్తుల్లో భాగంగా కమలాపురంను సీపీఐకి కేటాయించారు. ఇంకా కడప, పులివెందుల, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇక నామినేషన్లు వేసేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు ముహూర్తబలాలు చూసుకొని నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జాతకం ప్రకారం రెండుమూడు సెట్లు నామినేషన్లు వేయనున్నారు. సీఎం జగన్ ఈనెల 25న పులివెందుల అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అదేరోజు పులివెందులలో బహిరంగ సభ పెట్టనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇక హోరాహోరీ

నామినేషన్ల ఘట్టం ప్రారంభమవడంతో ఇక అభ్యర్థులు హోరాహోరీ ప్రచారాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌లు ఎన్నికల ప్రచారాలను నిర్వహిస్తున్నాయి. మేమంతా సిద్ధం పేరుతో ప్రొద్దుటూరులో సభ నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రొద్దుటూరులో బహిరంగ సభ నిర్వహించారు. వైఎస్ షర్మిల కడప నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేపట్టి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇప్పటికే అగ్ర నేతలు జిల్లాలో తొలివిడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇక నామినేషన్ల తర్వాత మరోమారు అగ్రనాయకులు జిల్లాకు రానున్నారు. బీజేపీ తరపున కేంద్ర మంత్రులు ప్రచారానికి వస్తున్నారని చెబుతున్నారు. అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించనున్నారు.

జన కేతనం

రాష్ట్రంలో కూటమిదే విజయం

● 24న రాజంపేటలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బహిరంగ సభ
● టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి వెల్లడి



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ జోనల్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు, సుగవాసి

రాజంపేట, ఏప్రిల్ 17: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అటు ఎంపీ, ఇటు ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ స్వీప్ చేస్తుందని తెలుగుదేశం పార్టీ జోనల్ ఇన్‌చార్జి దీపక్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం రాజంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 24 పార్లమెంటు స్థానాలు ఎన్‌డీఏ కూటమి కైవసం చేసుకుంటుందని సర్వేలు వచ్చాయని, మిగిలిన స్థానాన్ని కూడా గెలుచుకుని మొత్తం స్వీప్ చేస్తామన్నారు. ఈనెల 24వ తేదీ రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం నామినేషన్ దాఖలు చేస్తున్నారని, అదేరోజు సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజంపేట ఎన్నికల బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. రాజంపేటలో చిన్నచిన్న ఇబ్బందులను సర్దుబాటు చేశామని, టికెట్లు ఆశించి రాని వారంతా ప్రచారంలో పాల్గొని అధినేత ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటారన్నారు. రాజంపేటలో అసంతృప్తికి తావు లేదన్నారు. టీడీపీ అధినేత ప్రకటించిన సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుకు ఆయన సేవలను గుర్తించి సముచిత స్థానం ఇస్తామని తెలిపారు. జగన్‌మోహన్‌రాజు పార్టీ కోసం ఎంతో పాటుపడ్డారని, ఈ విషయం పార్టీ గుర్తించిందని, ఆయన కృషికి తగ్గట్టు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. రాజంపేటలో వైసీపీ నేతలు ఇప్పటికే భారీఎత్తున టీడీపీలో చేరారని, తిరిగి పెద్దఎత్తున కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ ప్రధాన నాయకులు, ఎంపీటీసీలు అధినేత వద్ద పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారన్నారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఎక్కడ చూసినా టీడీపీ ప్రభంజనం బలంగా వీస్తోందన్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, తాను ఎక్కడ పర్యటించినా నియోజకవర్గ ప్రజలు పార్టీలకతీతంగా ఆదరిస్తున్నారని, ఆదరించి నీరాజనాలు పలుకుతున్నారని, విజ్ఞులైన ప్రజలందరూ తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారని వెల్లడించారు. తాను 24వ తేదీ బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్నానని, అదేరోజు సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజంపేటలో జరిగే బహిరంగసభలో ప్రసంగించనున్నారని ఈ కార్యక్రమాలకు ప్రజలు వచ్చి తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా ముస్లింల బైఠాయింపు

జమ్మలమడుగు, ఏప్రిల్ 17: స్థానిక వైసీపీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్యాలయం ఎదురుగా గేటు వద్ద జమ్మలమడుగు ముస్లింలు బైఠాయించారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి 7.35 గంటల వరకు బాధితులు కార్యాలయం వద్ద ఉన్నారు. వారు మాట్లాడుతూ మంగళవారం మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం కొత్తమసీదు సమీపాన జమ్మలమడుగుకు చెందిన గౌషియా మసీదు పీఠాధిపతిపై వైసీపీ నేత, కౌన్సిలర్ ముల్లా జానీ అసభ్యకర వాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. ఇందుకు సంబంధించి వైసీపీ కార్యాలయం వద్ద బైఠాయించినట్లు తమ పీఠాధిపతిపై అనవసరమైన వాఖ్యలు చేయడాన్ని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డికి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, వైసీపీ నేత మళ్లికరెడ్డి హనుమంతరెడ్డి తదితరులు ముస్లింలతో పీఠాధిపతి శిష్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు బాధితులు తెలిపారు. ముల్లాజానీతో మాట్లాడి క్షమాపణ చెప్పిస్తామని, ఒకవేళ చెప్పకపోతే పార్టీ నుంచి ఆయనను సస్పెండ్ చేస్తామని చెప్పినట్లు పీఠాధిపతి శిష్యులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి అంతా వెళ్లిపోయారు. సమస్యను తెలుసుకున్న వైసీపీ కార్యాలయం వద్దకు అర్బన్ పోలీసు స్టేషన్ సిబ్బంది ఎస్ఐ సుబ్బారావు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సమస్య నియోజకవర్గమంతా వ్యాపించినట్లు తెలుస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం గురువారం పరిష్కరిస్తామని చెప్పినట్లుగా బైఠాయించిన వారు తెలిపారు.



జమ్మలమడుగు వైసీపీ కార్యాలయం ముందు గేటువద్ద బైఠాయించిన ముస్లింలు

హామీలు బారెడు.. అమలు జానెడు

- సాక్షాత్తు సీఎం జగన్ హామీలకే తిలోదకాలు
- మళ్లీ గెలిపించాలంటూ వైసీపీ ఇంటింటి ప్రచారం
- ఇచ్చిన హామీల అమలు ప్రశ్నార్థకమే...
- ఇదీ బద్వేలు నియోజకవర్గ దుస్థితి

(కడప-ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు రూ.500 కోట్ల అభివృద్ధి అయితే జరిగిన పనులు మాత్రం రూ.47 కోట్లు మాత్రమే. ప్రతిపక్ష నేత హోదాలో చాంతాడంత హామీలు ఇస్తే ముఖ్యమంత్రి అయ్యాక అమలుకాక పోవడంతో హామీలు బారెడు... అమలు అన్నట్లుగా తయారైంది. 2004 నుంచి బద్వేలు నియోజకవర్గంలో కాంగ్రెస్, వైసీపీ అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. ఇక 2019, 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో సైతం వైసీపీ అభ్యర్థే గెలుపొందారు. అయితే ప్రతిపక్ష నేత, సీఎం హోదాలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోక అటు జనం, ఇటు రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారంలో ఉండి ఐదేళ్లు ఏం చేయలేకపోయారు. మళ్లీ ఇప్పుడు వైసీపీనే గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు ఇదేం చోద్యమని ముక్కున వేలేసుకుంటున్నారు ఓటర్లు.



బద్వేలులోని మహ్మద్‌కాలనీ రోడ్డు దుస్థితి

సోమశిలకు ఎగనామం

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది బద్వేలు, గోపవరం పరిస్థితి. గోపవరం పక్కనే సోమశిల ప్రాజక్టు ఉంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం గోపవరం మండలంలో ఊర్లన్నీ ఖాళీ చేశారు. అయితే చెంతనే నీరున్నా చుక్క కూడా ఉపయోగించలేని పరిస్థితి. సోమశిల నీటిని బద్వే లు పెద్దచెరువుకు నింపితే బద్వేలు, గోపవరం మండలాలకు సాగు, తాగునీటి సమస్య తీరుతుందని ఎప్పటి నుంచో ఆ ప్రాంతీయుల కల. సోమశిల నీటి కోసం ఆందోళనలు, పాదయాత్రలు, ఉద్యమాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ విజ్ఞప్తి మేరకు సోమశిల ప్రాజెక్టు నుంచి బద్వేలుకు నీరు ఇచ్చేందుకు 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక జీఓ ఇచ్చారు. పనులు పట్టా ఎక్కుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. నాడు ప్రతిపక్ష నేత హోదా లో జగన్ బద్వేలు నాలుగురోడ్ల కూడలి బహిరంగసభలో మాట్లాడుతూ మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సోమశిల నుంచి 2 టీఎంసీలు కాదు 5 టీఎంసీల నీటిని ఇస్తానని జనం సాక్షిగా హామీ ఇచ్చారు. అన్నట్లుగానే జగన్ సీఎం అవడంతో ఇక సోమశిల వాటర్ వస్తుందని జనం భావించారు. ఐదు టీఎంసీల నీరు వస్తే గోపవరం, బద్వేలులో సుమారు 25వేల ఎకరాలకు అటు నేరుగా, ఇటు బోరుబావుల ద్వారా నీరందుతుందని రైతులు సంతోషించారు. నాలుగురోడ్ల కూడలిలో జనం సాక్షిగా ఇచ్చిన హామీకి జగన్ మంగళం పాడించి ఎత్తిపోతల పథకాన్ని ఎత్తి సోమశిలలో పడేశాడు.

రూ.500 కోట్లతో బద్వేలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

2021 జూలై10న ఉప ఎన్నికల వేళ నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం అంటూ సీఎం జగన్ ప్రకటించారు. దీంతో బద్వేలు నియోజకవర్గం రూపురేఖలు మారుతాయంటూ బద్వేలులో జనం ఎదుటే అన్నారు. రూ.130.6 కోట్లతో చేపట్టే 140కి.మీ మేర సీసీ రోడ్లు,వాటిలో 104 కోట్లు మిగతా 26.6 కోట్లతో శ్మశానాలు, కూరగాయలు మార్కెట్ అభివృద్ధికి వాణిజ్య సముదాయాలు ఇతర పనులకు శంకుస్థాపన చేశారు. కలసపాడు, అట్లూరు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో ఆలయాల అభివృద్ధికి, వంతెనలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కడప జిల్లాకు ఎంత చేసినా తక్కువే. నన్ను ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. మీరు ఇచ్చిన చలువతోనే నేడు రాష్ట్రంలో తిరగగలుగుతున్నా, మీ ప్రేమ, ఆదరణ ఎప్పుడూ మరిచిపోలేనని ఊకదంపుడు ఉపన్యాసం బాగానేచేశాడు కానీ పనుల కోసం నిధులు విడుదల చేసి ఉంటే పనులు త్వరగా పూర్తయ్యేవి. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు వెళ్లలేదు. సీసీరోడ్లు కేవలం రూ.47 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కూరగాయల మార్కెట్, పార్కులు, శ్మశానల అభివృద్ధికి ఇచ్చిన హామీలు పూర్తి కాలేదు. నాగులచెరువును సుందరీకరణ చేపడతామన్నారు. ఆ హామీ అటకెక్కించారు.



కలసపాడు సమీపంలో ఇక్కడే వంతెన నిర్మాణం కోసం జగన్ 9.5 కోట్లతో శంకుస్థాపన చేసింది

జన కేతనం

దాహం దాహం

- బద్వేలులో తాగునీటి సమస్య నివారణకు టీడీపీ హయాంలో పెన్నా నుంచి వాటర్ స్కీం ద్వారా నీటిని అందించాలనుకున్నారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ ప్రాజెక్టును అటకెక్కించింది. బ్రహ్మంసాగర్ ద్వారా నీళ్ల ఇస్తున్నారు అయితే మూడురోజులకొకసారి వస్తుండడంతో జనం అవస్థలు పడుతున్నారు.
- పోరుమామిళ్లలో రూ.25 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టినా అవి ముందుకు సాగడంలేదు. అసంపూర్తి పనులతో జనం అవస్థలు పడుతున్నారు. మినీ మార్కెట్‌యార్డు పనులు పోరుమామిళ్లలో మధ్యలోనే నిలిచిపోయాయి.
- కాశినాయన మండలంలో 22 దేవాలయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అదీ నెరవేరలేదు. శిథిలావస్థకు చేరుకున్న బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలకు అదనపు గదులు ఇస్తామని హామీ ఇచ్చారు. నేటికీ కూడా హామీ నెరవేరలేదు. బికోడూరు మండలం గోవిందాయపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదీ నెరవేరలేదు. అట్లూరు మండలం వేమలూరు సగిలేరు మధ్య రూ.22 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి సీఎం జగన్ వేసిన శిలాఫలకం అలాగే నిలిచిపోయింది. ముంపువాసులకు ఇళ్లు, భూములు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అదీ అమలు కాలేదు. కుడికాల్వ పనులు పూర్తి చేసి అట్లూరుకు తెలుగంగ నీరు అందిస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. రాత్రి పూట సిద్దవటం మీదుగా కడప వెళ్లాలంటే చెక్‌పోస్టుతో ఇబ్బందిగా ఉంది. అత్యవసర సమయాల్లో అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం చెక్‌పోస్టు ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు అమలు కాలేదు. కలసపా డు నుంచి బ్రాహ్మణపల్లెకు వెళ్లే దారిలో సగిలేరు వంతెనపై రూ.9.5 కోట్లతో నిర్మించే బ్రిడ్జికి సీఎం జగన్ ఉప ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి పూర్తయితే కలసపాడులోని నాలుగు గ్రామాలు, ప్రకాశం జిల్లాలోకి కూడా రవాణా మెరుగు అవుతుందని చెప్పుకొచ్చారు. హామీ శిలాఫలకాలకే పరిమితమైంది.

అడుగుపడని వెలుగొండ

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో 25వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఆ ప్రాజెక్టు డిజైన్ చేశారు. 2004 ఎన్నికల్లో, 2009, 2019 ఎన్నికల్లో కూడా వెలుగొండ ప్రాజెక్టు నీరు తీసుకవస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకు అది కార్య రూపం దాల్చలేదు. వెలిగండ నీరు వస్తే తెలుగుగంగ జలాలకు అందని కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లోని గ్రామాలకు సాగునీరు అందుతుంది. అయితే హామీ ముందు కు పడలేదు. తెలుగుగంగ ప్రాజెక్టు పిల్ల కాల్వలు, ఇతర పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి కేవలం చెరువులు నింపి వాటి ద్వారా అందిస్తున్నారు.



బద్వేలులోని కూరగాయల మార్కెట్



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది.

-భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



హత్య కేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ తులసీరామ్

రాయచోటిటౌన్, ఏప్రిల్17: ఈడిగప ల్లె సమీప చిన్నచెరువులో జరిగిన కొండమర్ల ఈశ్వరయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. సుండుపల్లె మండలం పొలిమేరపల్లె గ్రామం ఈడిగపల్లె చిన్న చెరువులో జరిగిన ఈశ్వరయ్య హత్య కేసు వివరాలను రాయచోటి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెల్లడించారు. సుండుప ల్లె మండలం చిన్నగొల్లపల్లె పంచా యతీ పూజారివాండ్లపల్లె సమీపంలో ఈనెల 1వ తేదీ రాత్రి శ్రీచింతకోట మ్మ జాతర జరిగింది. జాతరకు సంబేపల్లె మండలం ప్రకాశ్ నగర్ కాలనీ వాసి కొండమ ర్ల ఈశ్వరయ్య వెళ్లాడు. ఈ క్రమంలో ఈడిగప ల్లె వద్ద చాందినీ బండి వద్ద డ్యాన్సులు చూ స్తున్న ఈశ్వరయ్యను గుంతరాచపల్లె వాసి బు జే రవీంద్రనాయుడు అలియాస్ రవి, ఈడిగ పల్లెకు చెందిన కమలాపురం జ్ఞానేశ్వర్ అలియాస్ జాను రాత్రి మూడు గంటల సమయంలో ఈడిగపల్లె పక్కనే ఉన్న చిన్నచెరువులోకి తీసుకెళ్లి బండరాళ్లతో ముఖం, తల మీద కొట్టి చంపి అని వద్ద ఉన్న రూ.38,500 డబ్బు దొంగలించుకుపోయారు. ఈ విషయంపై మృతుడు ఈశ్వరయ్య తమ్ముడు కొండమర్ల చిన్నప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, సుండుపల్లె ఎస్‌ఐ ఎస్‌కేఎం హుస్సేన్ ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని నిందితుల కోసం గాలిస్తుండగా 16వ తేదీన రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా ఇచ్చిన సమాచారంతో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి చేసి రూ.29 వేలు స్వాధీనం చేసుకుని బుధవారం రాయచోటి కోర్టులో హాజరు పర్చగా కోర్టు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ తెలియజేశారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఛేదించిన రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, సుండుపల్లె ఎస్‌ఐ ఎస్‌కేఎం హుస్సేన్‌ను డీఎస్పీ అభినందించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ తులసీరామ్

కొనసాగుతున్న ఉద్రిక్తత

చిన్నమండెం, ఏప్రిల్17: శ్రీనివాసపురం వద్ద మంగళవారం ప్రారంభమైన గొడవతో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. వివరాల్లోకెళితే... మంగళవారం సాయంత్రం 5 గంటలకు టీడీపీ, వైసీపీ సానుభూతిపరుల నడుమ ఘర్షణ తలెత్తి టీడీపీ వర్గీ యులపై వైసీపీ వర్గీయులు రాళ్ల దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేంద్ర బలగాలతో ఎస్‌ఐ రమేశ్‌బాబు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అయితే బుధవారం ఉదయం బాధితురాలు ఓర్సు లక్ష్మికాంత బోరుబావి వద్ద నీటి కోసం వెళ్లగా అధికార పార్టీ గ్రామ స్థాయి నేత అండతో వైసీపీ సానుభూతిపరులు ఆమెను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. వెంటనే ఆమెను రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంత జరుగుతున్నా ఇక్కడ ఎలాంటి గొడవ జరగలేదని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమేశ్‌బాబు వివరణ ఇవ్వడం కొసమెరుపు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గస్తీ కాస్తున్నామే తప్ప గొడవలు జరగడం లేదని ఎస్‌ఐ మాట దాటవేస్తున్నారు.



ఓర్సు లక్ష్మికాంతను కొడుతున్న దృశ్యం

మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్ ఖైదీ మృతి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17: మదనపల్లె స్పెషల్ సబ్‌జైలులో రిమాండు ఖైదీ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆర్డీఓ హరిప్రసాద్ మెజిస్టీరియల్ విచారణ చేపట్టారు.

చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం ముత్తుకూరు వాసి పాపన్న కుమారుడు మొగిలప్ప(67) నాటుసారా విక్రయిస్తున్నాడని పోలీసులు ఈనెల 16న అరెస్టు చేసి పలమనేరు కోర్టు ఎదుట హాజరు పరచగా కోర్టు రిమాండు విధించిది. పోలీసులు మదనపల్లె సబ్‌జైలుకు మంగళవారం సాయంత్రం 5.30గంటలకు తీసుకొచ్చారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పరిశీలించిన సబ్‌జైలు సిబ్బంది మొగిలప్పను జైలు బ్యారెక్‌లోకి పంపారు. కాగా బుధవారం మొగిలప్ప అపస్మారక స్థితిలో పడి ఉండడంతో జైలు సూపరింటెండెంట్ రామకృష్ణయాదవ్, సిబ్బంది అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మొగిలప్ప మృతిచెందాడని నిర్ధారించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, మాలమహానాడు నేతలు ఆస్పత్రి వద్ద మొగిలప్ప కుటుంబీకులను విచారించారు.



మొగిలప్ప మృతదేహం

సివిల్స్‌లో హరిప్రసాద్‌కు 475వ ర్యాంకు

రాజంపేట టౌన్, ఏప్రిల్17: రాజంపేట మండలం ములక్కాయలపల్లె వాసి కదుమూరి హరిప్రసాద్‌రాజు సివిల్స్‌లో 475వ ర్యాంకు సాధించారు. జాతీయ స్థాయిలో 475వ ర్యాంకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. హరిప్రసాద్‌రాజు తల్లి వెంకటసుబ్బమ్మ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారని, తండ్రి నాగేంద్రవర్మ టీచర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందారు. రాజు చెల్లెలు చందన ఎంబీబీఎస్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. మరో చెల్లెలు ఖరగ్‌పూర్‌లో ట్రిపుల్‌ఐటీ చదువుతున్నారు. చిన్నతనం నుంచే చదువులో ముందుండే హరిప్రసాద్ సివిల్స్‌కు ఎన్నికవడంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు.



తమ్ముడిపై నాటు తుపాకీతో అన్న కాల్పులు

- ఆస్తి తగాదాలే కాల్పులకు కారణం

గుర్రంకొండ, ఏప్రిల్ 17: భూతగాదాలతో తమ్ముడిపై అన్ననాటు తుపాకీతో కాల్పులు జరిపిన సంఘటన మంగళవారం రాత్రి టి.పసలవాండ్లపల్లె పంచాయతీ ఎగువ హరిజనవాడలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... ఎగువహరిజనవాడ వాసి బాలపోగుల జయప్ప, విశ్వనాథ్ అన్నదమ్ములు. వీరికి భూముల విషయమై కొంత కాలంగా తగదాలున్నాయి. ఈ క్రమంలో అన్నదమ్ములిద్దరూ రెండు రోజుల కిందట గొడవపడ్డారు. దీంతో ఆగ్రహించిన విశ్వనాథ్ అన్న జయప్ప ఇంటి వద్ద ఉన్న టెంకాయ చెట్టును నరికేశాడు. ఈ నేపథ్యంలో జయప్ప మంగళవారం రాత్రి విశ్వనాథ్‌తో గొడవపడ్డాడు. ఆవేశానికి లోనైన జయప్ప ఇంట్లో ఉన్న నాటు తుపాకీ తీసుకొచ్చి విశ్వనాథ్‌పై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో విశ్వనాథ్ ఎడమ వైపు ఛాతిపైన, కుడికాలు తొడపైన తుపాకీ నుంచి వచ్చిన రవ్వలు గుచ్చుకున్నాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. నిందితుడు జయప్ప పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.



గాయపడిన విశ్వనాథ్

సీతారాముల చరితం.. సకల పాపహరణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- కనులపండువగా సీతారాముల కల్యాణోత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన రామాలయాలు





పీలేరులో సీతారాముల కల్యాణోత్సవం





పీటీఎం, బి.కొత్తకోటలలో సీతారాముల కల్యాణం దృశ్యాలు
పైచిత్రం పెద్దమండ్యంలో అలంకారంలో సీతారామలక్ష్మణులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని అమ్మినేని వీధిలోని కోదండరామాలయంలో ఆలయకమిటీ సభ్యులు భవానీప్రసాద్, దుగ్గిరెడ్డి, జగన్‌మోహన్, సాయి, శంకర్‌యాదవ్ ఉదయం సీతారాముల కల్యాణం అత్యంతవైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాల తోపాటు వడపప్పు, పానకం అందజేశారు. మదనపల్లె వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా పుంగనూరురోడ్డులో బోయకొండ ఆర్చీవద్ద, బస్సు సెల్టర్ వద్ద, అప్సారా వువీధి, ఘటిక ఆజంనేయస్వామి ఆలయం వద్ద వడపప్పు, పానకం, మజ్జిగ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్, అమరనాథ్, ట్రెజరర్ లక్ష్మీదీపక్, సభ్యులు బాలాజీ, అనిల్, శివప్రసాద్, నాగారాజ, పాల్గొన్నారు. పట్టణం కోటవీధిలో మదనపల్లె నవయుగ స్వర్ణకారుల సంఘం జ్యువెలర్స్ షాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా ర్వహించారు. అఖిల భారత విశ్వకర్మ మహా సభ జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర స్వర్ణకారుల సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి రాములవారి భారీ చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జ్యువెలర్స్ షాపు యజమానులు, స్వర్ణకారులు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా, నగర సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వరాల అంజనేయస్వామి ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అయోధ్యనగర్‌లో శ్రీరామనవమి సందర్భంగా సీతారా ముల కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక ఎస్టేట్‌లో వినాయకస్వామి కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, ప్రేమ్ చంద్, ఆది, బాలు, రాజశేఖర్, బావజాన్, తులసీ రాం, జయరామ్, దేవా, మహేష్, అన్వేష్‌లు భారీగా అన్నదానం చేశారు. నీరుగట్టువారిపల్లె కోదండరామాలయంతోపాటు కాట్లాటపల్లె రోడ్డులోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, కురవంకలోని అంజనేయస్వామి ఆలయం, సీటీఎం వీరాంజనేయ స్వామి ఆలయం, పుంగనూరురోడ్డు, నిమ్మనపల్లె రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

మదనపల్లె టౌన్: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పట్టణంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పలుచోట్ల శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. బుధవారం స్థానిక అమ్మినేని వీధిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బసినికొండ లారీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నాయకులు షాజహాన్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసారు. అలాగే తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, దొరస్వామినాయుడు వేడుకల్లో పాల్గొన్నారు.

పీలేరులో: శ్రీరామ నవమి వేడుకలను బుధవారం పీలేరు పట్టణంలో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కోదండరామ స్వామి ఆలయం, నడుం రోడ్డులోని కళ్యాణ సీతారామస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు.భక్తుల జైశ్రీరామ్ నినాదాల నడుమ వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణోత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవాలను తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. వచ్చిన భక్తులకు పానకం, వడపప్పుతోపాటు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలోని ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు ఉదయం 'శోభాయాత్ర' పేరిట స్కూటర్ ర్యాలీ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు కె.రామకృష్ణారెడ్డి, నంద్యాల మణి, అర్చకులు ఆనందస్వామి, తిరుమలాచార్యులు పాల్గొన్నారు.

కలికిరిలో: మండలంలోని పలు ప్రాంతాల్లోని సీతారాములవారి ఆలయాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రామాలయం, రెడ్డివారిపల్లె, క్రాస్‌రోడ్డు, రంగనాథపురం తదితర గ్రామాల్లో నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను ఆయా గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రామాలయాల వద్ద భక్తులకు పానకం, వడపప్పు విరివిగా పంపిణీ చేశారు.

కురబలకోటలో: మండలంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని అంగళ్ళు, కురబలకోట, పిచ్చలవాండ్లపల్లె, కమతంపల్లె, ముళకవారిపల్లె తదితర గ్రామాల్లోని రాములవారి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను పండితులు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పెద్దమండ్యం, రెడ్డివారిపల్లి, ముసలికుంట, బండ్రేవు, మందలవారిపల్లి, గుడిసెవారిపల్లి, గురివిరెడ్డిగారిపల్లి, మిట్టామాలపల్లి, గుర్రంవాండ్లపల్లి, కలిచెర్ల, కోటగుట్టపల్లి, శివపురం, వెలిగల్లు, బండమీదపల్లా, కోటగుట్టపల్లి రామాలయాల్లో సీతరాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఆయా గ్రామాలలో ధర్మకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలంలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కలకడలో:కలకడ మండల ప్రజలు శ్రీరామ నవమి పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నడిమిచెర్లలోని కోదండరామాలయం, గువ్వలవారిపల్లె, సింగనొడ్డుపల్లె, మర్రిమానుపల్లె, గుడిబండ, తెట్టు గ్రామాలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు, అన్నదానాలు చేశారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలో బుధవారం శ్రీరామనవమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని పోకనాటివీధి, హరిమందిరంవీధి లతో పాటు వివిధ గ్రామాలలో వున్న రామాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా పోకనాటివీధిలో వున్న పురాతన రామాలయంలో సీతారాముల వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. జ్యోతిచౌక్‌లో దేరింటికుమార్, భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎం మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీతారాములను దర్శించుకోవడానికి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. రంగసముద్రం లోని విసనకర్రవాండ్లపల్లెలో వెలసిన కోదండ రామాలయంలో ఉదయం నుండి స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహ మూర్తులను సుందరంగా అలంకరించి మేళతాళాలతో, బళ్లారి డ్రమ్ములతో, పురవీధుల్లో అత్యంతవైభవంగా ఊరేగించారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణులను దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో శేష సాయిబాబా ఆలయంలో రాములవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

నీరుగట్టువారిపల్లె 'పట్టు'కు అంతర్జాతీయ ఖ్యాతి

- కండలేరు నీటి పథకం కోసం ప్రయత్నిస్తా
- ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన నీరుగట్టువారిపల్లె నేతన్నలు

కలికిరి, ఏప్రిల్ 17: మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో తయారయ్యే పట్టు వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి దక్కేటట్టు కృషి చేస్తానని రాజంపేట ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ పట్టు ఉత్పత్తుల నిపుణురాలు ప్రస్తుతం అమెరికాలో పని చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. అంతర్జాతీయంగా ఎగుమతులు సాధిస్తే నీరుగట్టువారిపల్లె పట్టుకు మంచి ఖ్యాతి లభిస్తుం దన్నారు. నీరుగట్టువారిపల్లె చేనేత సంఘ నాయకుడు, వైసీపీ చేనేత విభాగం డివిజనల్ కోఆర్డి నేటర్ భువనేశ్వరి సత్య ఆధ్వర్యంలో 200 మందికిపైగా నేతన్నలు బుధవారం కలికిరిలో కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో బీజేపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారరు. ఈ సందర్భంగా ఆయన్న మాట్లాడుతూ కండలేరు పథకం దురదృష్టవశాత్తు మూలనపడిందని, అయినా దాన్ని తిరిగి మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు. పదేళ్ళు ఎంపీగా వున్న మిథున్ రెడ్డి ప్రజల కోసం ఒక్క పని కూడా చేయించలేదని విమర్శించారు. కాగా బీజేపీలో చేరినవారిలో భువనేశ్వరి సత్య నాయ కత్వంలో శ్రీకాంత్, జయకుమార్, సుబ్రమణ్యం, భాస్కర్, తనోజ్, వెంకట్రమణ, చంద్రశేఖర్, రెడ్డిప్రసాద్, జ్యోతిప్రకాష్, రెడ్డిశేఖర్, లోకేష్, వెంకటేశు ఉన్నారు.

వీరబల్లి, సుండుపల్లె టీడీపీ నాయకుల సంఘీభావం

కలికిరి, ఏప్రిల్ 17: రాజంపేట పార్లమెంటు పరిధిలోని వీరబల్లి, సుండుపల్లె మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు ఎన్డీయే ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి సంఘీభావం తెలిపారు. బుధవారం వారంతా కలికిరిలోని బీజేపీ కార్యాలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఎన్నికల్లో తామంతా సమష్టిగా కృషి చేసి ఎన్డీయే ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం పాటుబడుతామని హామీ ఇచ్చారు. వీరబల్లి సింగిల్ విండో చైర్మన్ కల్లూరు రామమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతాప్ రెడ్డి, శంకర్ రెడ్డి, చాంద్‌బాషా, మహ్మద్ రఫీ, జనార్ధన, వెంకటసుబ్బా రెడ్డి, తాజీర్, మహబూబ్ ఖాన్, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, మల్‌రెడ్డి జయచంద్రా రెడ్డి, నాగిరెడ్డి, సుండుపల్లె మండలానికి చెందిన మంత్రి శివారెడ్డి, మహేశ్వర రాజుల ఆధ్వర్యంలో మరో పది మంది కిరణ్‌కుమార్ రెడ్డిని కలిసిని వారిలో ఉన్నారు.

రేపు కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి నామినేషన్

- మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఆహ్వానం



కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన తంబళ్లపల్లె కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 17: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు నామినేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ములకలచెరువు నుంచి తంబళ్లపల్లెకు వెళ్లి అక్కడ నామి నేషన్ దాఖలు చేయనున్నారు. ఈ క్రమంలో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని బుధవారం జయచంద్రారెడ్డి కలిసి తన నామినేషన్ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. నామినేషన్ కార్యక్రమానికి వస్తానని కిరణ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో తంబళ్ళపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు పాల్గొన్నారు.

బురకాయలకోటలో జయచంద్రారెడ్డి సతీమణి ప్రచారం



ములకలచెరువు మండలంలోని బురకాయలకోటలో బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధాలు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డికి ఒక్క అవకాశం కల్పించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి , టీడీపీ నేతలు మౌళా, కేశవులు, సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్, గోపాల్ రాజు, రామకృష్ణమరాజు, చెన్నకేశవులు, మురళీస్వామి, ఫజురుల్లా, రసూల్‌సాబ్, శ్రీనివాసులు, జయచంద్రా, కృష్ణమూర్తి, మహిళలు సునితమ్మ, ఖాదర్‌బీ, ఫాతిమా, మహబూబ్, అమ్ములు పాల్గొన్నారు.

భైరవేశ్వరునికి నల్లారి కిశోర్‌కుమార్ పూజలు

గుర్రంకొండ, ఏప్రిల్ 17:పీలేరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బుధవారం భైరవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గుర్రంకొండ మండలం ఎల్లుట్ల పంచాయితీ శీలంవారిపల్లెలో వెలసిన భైరవేశ్వరస్వామి ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలను చేయించారు. నల్లారి కుటుంబ సభ్యులు ఎన్నికల్లో నామినేషన్ వేసే ముందు ఈ ఆలయంలో పూజలు చేయడం అనవాయితీ. ఈ క్రమంలో పీలేరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, సతీమణి తనూజరెడ్డి, కుమార్తెతో కలిసి వచ్చి స్వామి వారికి పూజలను చేశారు. కార్యక్రమంలో నాయకులు మూర్తిరావు, జగదీష్, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, హరిప్రసాద్ నాయుడు, జ్యోతిరెడ్డి, మహాత్మారెడ్డి, నౌషాద్ అహ్మద్, ఏజాజ్ అహ్మద్, రామ్, చలపతి, శేఖర్, చంద్రబాబు, నాగేంద్ర, సుబ్రమణ్యం, రెడ్డిశేఖర్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రామసముద్రం, ఏప్రిల్ 17: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. చొక్కాండ్లపల్లె పంచాయతీ జోగి ఇండ్లుకు చెందిన వెంకటరమణ ఆంధ్ర కర్ణాటక సరిహద్దులోని బేడపల్లె చెక్ పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న 192టెట్రా కర్ణాటక మద్యం ప్యాకెట్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ట్రాక్టరు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

పీలేరు, ఏప్రిల్ 17: పీలేరు మండలం పొంతలచెరువు క్రాస్ వద్ద ఇసుక ట్రాక్టరు ఢీకొనడంతో కావలిపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన ఎం.మనోహర్(25) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని స్థానికులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

మానవత్వం చాటుకున్న సిమెంటు డీలర్లు

పీలేరు, ఏప్రిల్ 17: తమ వద్ద పని చేసిన ఓ హమాలీ మృతి చెందిన విషయం తెలుసుకుని అతని కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందించిన మానవత్వం చాటుకున్నారు పీలేరుకు చెందిన సిమెంటు, స్టీలు డీలర్లు. పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ కొత్తపేటకు చెందిన రెడ్డప్ప ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఆ విషయం తెలుసుకున్న సిమెంటు, స్టీలు డీలర్లు బుధవారం తమ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. డీలర్ల పెద్దమనస్సును అందరూ అభినందించారు.

జగన్‌కు ఎస్సీల శాపం తగులుతుంది

పీలేరు, ఏప్రిల్ 17: ముఖ్యమంత్రి జగన్‌కు రాష్ట్రంలోని ఎస్సీల శాపం తగులుతుందని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు తెలిపారు. పీలేరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాజంపేట పార్లమెంటు కార్యదర్శి కప్పరం చంద్రయ్య, పీలేరు మండల అధ్యక్షుడు నగరిమడుగు సుభాష్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఎస్సీ సంక్షేమ నిధులను గల్లంతు చేసి తీరని అన్యాయం చేశారన్నారు. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలు జగన్‌ను గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. రవీంద్ర నాయక్, అశోక్, మణి, మురళీ, శ్రీనివాసులు, రవి, మునిరాజా పాల్గొన్నారు.

న్యాయయాత్ర విజయవంతం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17: మదనపల్లెలో జరిగిన ఏపీ న్యాయయాత్ర సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నింపిందన్నారు. నాయకులు సురేంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, అజయ్, శ్రీనివాసులు, సలీం, నాగరాజ, సలీవుల్లా పాల్గొన్నారు.

కమనీయం.. పట్టాభిరాముడి కల్యాణం





సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తజనం

వాల్మీకిపురం, ఏప్రిల్ 17: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు నిత్య కైంకర్యములతో ప్రత్యేక పూజలు జరిగాయి. తిరుచ్చి ఉత్సవం అనంతరం భోగోత్సవమూర్తులకు స్నపనతి రుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణు లకు ఊంజల్‌సేవ నిర్వహించారు. సీతారాముల కల్యాణ ఘట్టం తిల కించిన భక్తజనం పులకించిపోయారు. ఈసందర్భంగా మండల పరిష త్, గ్రామ పంచాయతీ తరపున, టీటీడీ అధికారుల చేత కల్యాణ మహోత్సవానికి పట్టువస్త్రాలు సమర్పించారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గరుడునిపై పట్టాభిరాముడి వైభవం

కల్యాణోత్సవం అనంతరం సీతాలక్ష్మణ సమేతుడైన పట్టాభిరాముడిని తనకెంతో ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై విశేషాలంకరణలతో అధిష్టింపచేసి పట్టణ పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ బాణాసంచా, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి. ఈకార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్,సూపరింటెండెంట్ వెంకటస్వామి,ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు,అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యు లు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం పట్టాభిరాముడిని బ్రహ్మరథంపై నగరోత్సవం, సాయంత్రం ధూళి ఉత్సవం జరగనున్నాయి.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 17: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా గురువారం శ్రీరామ నవమి పండుగ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. స్థానిక పట్టాభి రామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నవమి వేడుకలు నిర్వహించారు. సీతా లక్ష్మణ సమేతత పట్టాభిరాములకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శ్రీరాముడి చిత్రపటానికి పూజలు చేసి వేడుకలు నిర్వహించారు.

చంద్రబాబుతోనే బీసీలకు గుర్తింపు



కిశోర్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న అమరనాథ గౌడ్

కలికిరి, ఏప్రిల్ 17: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తోనే బీసీలకు తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని రాష్ట్ర ఈడిగ బీసీ సాధికారిక అధ్యక్షుడు అమరనాథ్ గౌడ్ పేర్కొన్నా రు. రాష్టంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేస్తూ ఈడిగ కులస్తులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. బుధవారం నగరిపల్లెలో పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని సన్మానించిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలంతా ఏకతాటి పైకి వచ్చి బలోపేతం కావలసి వుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాధికారిక బీసీ కార్యదర్శి పురం రామమూర్తి, కందుకూరు ధర్మేంద్ర గౌడ్‌లు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: టీడీపీతోనే బీసీలకు సముచిత న్యాయం జరు గుతుందని టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు రాజన్న పేర్కొన్నారు. బుధవారం వెంగంవారిపల్లి పంచాయతి బాలినాయునిపల్లిలో జయహో బీసీ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నేతలు మాట్లాడూతూ బీసీలకు చట్ట సభలలో ప్రాముఖ్యత కల్పించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషాకు సైకిల్ గుర్తుకు, ఎంపీగా కిరణ్ కుమార్‌రెడ్డికి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టే వెంకటేష్, మల్లప్ప, రమణ, జయమ్మ, శ్రీనివాసులరెడ్డి, శ్రీపతి, ప్రదీప్, చంద్ర, మహమ్మద్‌రఫి, శంకర, నారాయణ, మల్లికార్జున, రెడ్డెప్ప, లక్ష్మన్న, రామకృష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

తంబళ్లపల్లె ఏప్రిల్ 17 : తంబళ్లపల్లె నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మద నపల్లె డీఎస్పీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ మధు, ఎస్‌ఐ శివకుమార్‌లు తంబళ్లపల్లె నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ వేసే తహసీల్దార్ కార్యాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు ప్రపోజల్ చేసే అభ్యర్థి, మరో ఇరువురిని మాత్రమే లోపలికి అనుమతిస్తారన్నారు. అనంతరం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవేంద్ర తో సమీక్ష నిర్వహించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రబలగాలతో పోలీసుల కవాతు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామీ ణా ప్రాంతాల్లో బందోబస్తు నిమిత్తం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు ఆదేశాల మేరకు మండలంలోని విసనకర్రవాండ్లపల్లె, కొత్త సుబ్బరాయునిపల్లె గ్రామాల్లో ఎస్‌ఐ రవీంద్రబాబు కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

దొడ్డిపల్లెలో ఖాళీ అయిన వైసీపీ

కలికిరి, ఏప్రిల్ 17: కలకడ మండలం కె.దొడ్డిపల్లె పంచాయతీలో వైసీపీ ఖాళీ అయిపోయిందని మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వారం రోజుల క్రితం అదే పంచాయతీలోని పదిమంది ముఖ్య నాయకులు నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో పసుపు కండువాలు కప్పుకుని టీడీపీలో చేరారు. ఇక మిగిలిన వైసీపీ నాయకులు బుధవారం నగరిపల్లెలో కిశోర్ చేతుల మీదుగా కండువాలు కప్పుకున్నారు. దొడ్డిపల్లె పంచాయతీ వైసీపీ కన్వీనరు పురుషోత్తం, ఇతర వైసీపీ నాయకులు గురుస్వామి, రమణ తదితరులు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో పంచాయతీలో వైసీపీ ఖాళీ అయిందని టీడీపీ నాయకులు తెలిపారు.

ఆధారం లేకుంటే గుండె గు'బిల్లు'

- ఎన్నికల వేళ పట్టుబడుతున్న నగదు
- ఇప్పటివరకు రూ.1.60 కోట్లు స్వాధీనం

చిత్తూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొద్ది మొత్తం నగదు తీసుకుని వెళ్లాలన్నా జనం జంకుతున్నారు. బిల్లులు, ఆధారాలు చూపకుంటే ఇంతేసంగతులు. అధికారులు సీజ్ చేసేస్తున్నారు. 2014, 2019 ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి విపరీతమైన నిఘా పెరిగింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 233 కేసులు నమోదు చేసి రూ.1.60 కోట్లు స్వాధీనం చేసుకున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత రెండు ఎన్నికలతో పోల్చుకుంటే కేసుల సంఖ్య పెరిగింది. కోడ్ నేపథ్యంలో డబ్బుతో పాటు మద్యం, బంగారం వంటి ఇతర సామగ్రిని కూడా రికార్డులు లేకుంటే స్వాధీనం చేసుకుంటున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళితే ఆధారాలు చూపించాల్సి ఉంది. రూ.రెండు లక్షలకు మించితే ఎన్నికల విభాగంలోని రెవెన్యూ, పోలీసు అధికారులు లోతుగా పరిశీలిస్తారు. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉంటే జిల్లా ఎన్నికల అధికారులు నియమించే కమిటీ ముందుకు వెళ్తుంది. కమిటీ ఎదుట యజమాని హాజరై సరైన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై కమిటీ సంతృప్తి చెందితే నగదు అప్పగిస్తుంది. లేకుంటే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రూ.10 లక్షలకు మించి స్వాధీనం చేసుకుంటే ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఆ నగదు సీజ్ చేసిన అధికారులు బాధ్యులకు నోటీసులు జారీ చేస్తారు. వారిచ్చే సమాధానాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటారు.



గత ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ

నగదు మాత్రమే కాదు. గడియారాలు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు వంటి వాటితో పాటు కుక్కర్లు, క్రికెట్ కిట్లు వంటి బహుమానాల విలువ రూ.10 వేలకు మించితే పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. వ్యాపార నిమిత్తమైతే రికార్డులు చూపిస్తే తిరిగి అప్పగిస్తారు. లేకుంటే సీజ్ చేస్తారు. ఓటర్ల ప్రలోభానికని ఆధారాలు లభిస్తే కేసు నమోదు చేస్తారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తారు. 2014 ఎన్నికల్లో 66 కేసులు, 2019లో 116 కేసులు నమోదయ్యాయి. ఈసారి స్వల్ప వ్యవధిలోనే 223 కేసులు పెట్టారు. పోలింగ్ నాటికి ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

గత ఎన్నికల్లో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	పట్టుబడిన నగదు	మద్యం, బంగారం, డ్రగ్స్ వంటివి	మొత్తం విలువ	నమోదుచేసిన కేసులు
2014	రూ.11 లక్షలు	రూ.13 లక్షలు	రూ.23 లక్షలు	66
2019	రూ.5 లక్షలు	రూ.రూ.6.33 కోట్లు	రూ.6.38 కోట్లు	116
2024 (ఇప్పటివరకు)	రూ.1.19 కోట్లు	రూ.41 లక్షలు	రూ.1.60 కోట్లు	223

- 2014లో రూ.10 లక్షలు, 2019లో రూ.2 కోట్లు, ఈసారి రూ.20 లక్షలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- 2014లో డ్రగ్స్, మత్తు పదార్థాలు వంటివి లభించలేదు. 2019లో రూ.6 లక్షలు, తాజాగా రూ.4 లక్షలు విలువ చేసేవి పట్టుకున్నారు.
- 2019లో 12657 గ్రాముల బంగారం, 60 డైమండ్స్, 43970 గ్రాముల సిల్వర్, స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4.17 కోట్లు. తాజాగా రూ.14 లక్షలు విలువ చేసే 14 కిలోల రోల్డ్ గోల్డ్, 14.8 కిలోల సిల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- 2014లో రూ.2లక్షలు, 2019లో రూ.9 లక్షలు, ఇప్పుడు రూ.3 లక్షలు విలువ చేసే బహుమతుల్ని స్వాధీనపరచుకున్నారు.
- కోడ్ అమల్లోకి రాకముందు మార్చి 5న నగరి మండలం తడుకుపేట చెక్‌పోస్టు వద్ద రూ.3.98 కోట్ల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇదీ మందు

ఇంత బతుకూ బతికి!



ఇటీవల ఒక ధర్నా సందర్భంలో భరత్ పక్కనే ఒదిగి కూచున్న సుబ్రమణ్యంరెడ్డి (ఫైల్ ఫోటో)

అయ్యయ్యో.. ఇట్లా అయిపోయిందేందప్పా ఈయప్ప పరిస్థితి అని కుప్పం వైసీపీ ప్రచారాల్లో ఆయనను చూసిన వారంతా విచారపడుతూ ఉన్నారు. ఎం.సుబ్రమణ్యంరెడ్డి ఒకప్పుడు వైఎస్సార్ హయాంలో చిత్తూరు జడ్పీ చైర్మన్‌గా చేశారు. అదేమన్నా అల్లాటప్పా పదవా.. జిల్లాకే పెద్ద పదవి. 1999, 2004, 2009 ఎన్నికల్లో కుప్పంలో ఏకంగా చంద్రబాబు పైనే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఓడిపోయినా చంద్రబాబును సవాలు చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉండేది. ఆ తర్వాత ఆయన వైసీపీలో చేరారు. తండ్రి వైఎస్ లాగే కొడుకూ 2014లో తనకే టికెట్ ఇస్తాడని ఆశపడ్డారు. భంగపడ్డారు. రాజకీయ వైరాగ్యంతో అలికిడి లేకుండా ఉండిపోయిన ఆయన 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. పీకేఎం ఉడా (పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ) చైర్మన్‌గా ఎన్నికల ముందు ఓ రెండుమూడు నెలలు వెలిగారు. చంద్రబాబు గెలుపుకోసం ప్రచారమూ కాస్తంత ఉధృతంగానే చేశారు. కానీ దురదృష్టం వెన్నాడింది. టీడీపీ ప్రతిపక్షంలో కూచుంది. మళ్లీ రెడ్డిగారు వైరాగ్యంతో తిరుపతి చెక్కేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాయి కదా. జగన్ జిల్లా పర్యటనకు వచ్చినపుడు ఆయన చేతులమీదుగా వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే వైసీపీలో ఆయనకంటూ ప్రత్యేక స్థానం లేనట్టుంది. ప్రచారాల్లో ఇప్పుడు ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి తిరుగుతూ, ఆయన పక్కనో, లేదా వెనుకనో ఒదిగిపోయి ఫోటోల్లో కనిపిస్తున్నారు. వైసీపీ టికెట్ కోసం ఒకప్పుడు భరత్ తండ్రి చంద్రమౌళితో పోటీపడి నిరసన సభలు, సమావేశాలు సైతం నిర్వహించి సవాలు చేసిన సుబ్రమణ్యంరెడ్డికి ఇప్పుడీ స్థితి ఏమిటా అని జనం అనుకుంటున్నారు.

- కుప్పం

రోజాకు.. ఎదురుగాలి!

- అసమ్మతి, అసంతృప్తితో ఉక్కిరిబిక్కిరి
- ప్రభుత్వ వ్యతిరేకతకు తోడైన స్వపక్షీయుల కాక
- మరోపక్క చేరికల సమరోత్సాహంతో టీడీపీ

రెండుసార్లు స్వల్ప తేడాతో ఓటమితో ఉన్న టీడీపీలో గెలవాలన్న కసి కనపడుతోంది. ఆ దిశగా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మరోవైపు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రోజా.. అసంతృప్తి, అసమ్మతులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి ప్రభుత్వ వ్యతిరేకతా తోడవడంతో నియోజకవర్గంలో వైసీపీకి ఎదురు'గాలి' వీస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు.

- పుత్తూరు అర్బన్/ నగరి

గత ఎన్నికల్లో ఉన్న ఉత్సాహం వైసీపీ శ్రేణుల్లో ఈదఫా కనిపించడం లేదనే మాటలు వినబడుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో బొటాబొటీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన రాష్ట్ర మంత్రి రోజా హ్యాట్రిక్ కోసం ఆశలు పెట్టుకున్నారు. అయితే రెండుసార్లు పోరాడి ఆమెను గెలిపించిన కీలక నాయకులు ఈసారి ముఖం చాటేస్తున్నారు. ఆమెకు వైసీపీ అభ్యర్థిత్వం దక్కకుండా అధిష్ఠానం వద్ద తుదివరకు పోరాటం



చేసిన అసమ్మతి నాయకులు ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నా.. రోజాకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో మొదలియార్ ఓటర్లను ప్రభావితంచేసే వైసీపీ నాయకుడు ఏలుమలై మొదలియార్ (అమ్ములు), వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, క్షత్రియ సామాజికవర్గంలో పట్టున్న విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు, పుత్తూరుకు చెందిన రవిశేఖర్‌రాజు, నిండ్ర మండలం కొప్పేడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డివారి భాస్కర్‌రెడ్డి తదితరులు రోజాపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారాన్ని కుటుంబసభ్యుల నెత్తిన పెట్టిన మంత్రి రోజా అలకలు తీర్చడం, బుజ్జగింపులు, సర్దుబాట్లతో బిజీగా గడిపేస్తున్నట్లు తెలుస్తోంది.

దూకుడు మీదున్న టీడీపీ

మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ప్రచార పర్వంలో దూసుకెళుతున్నారు. ఏడాదిగా ఆయన వివిధ కార్యక్రమాలతో ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. 'మీతో మీ తెలుగుదేశం', 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పుత్తూరులో ఇటీవల అధినేత చంద్రబాబునాయుడు పాల్గొన్న ప్రజాగళం సభ అంచనాలకు మించి సూపర్ సక్సెస్ కావడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగింది. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి చేరేవారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండడం అనుకూల అంశంగా మారుతోంది. వైసీపీకి పట్టున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలను తనవైపు తిప్పుకోవడంలో గాలి భానుప్రకాష్ సఫలమయ్యారు. నామినేషన్ల పర్వం జోరందుకునే క్రమంలో వైసీపీ నుంచి కీలక నాయకుల చేరికలకు భానుప్రకాష్ స్కెచ్ వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



పెరిగిన వలసలు

గత రెండు ఎన్నికల్లో వైసీపీ గెలవడానికి ప్రధాన కారణమైన వడమాలపేట మండలంలో టీడీపీ అనూహ్యంగా పుంజుకొంది. టీసీ అగ్రహారం, తట్నేరి, కాయం పంచాయతీల్లో వైసీపీ నుంచి కీలక నాయకులు టీడీపీలో చేరారు. యాదవ సామాజికవర్గంలో పట్టున్న ఎస్‌బీఆర్ పురానికి చెందిన మాజీ సర్పంచ్ గెడ్డం సుబ్రమణ్యం యాదవ్, విజయపురం మండలంలో జగన్నాథపురం, కోసలనగరం, పాతార్కాడు పంచాయతీలకు చెందిన సోమశేఖర్, మునికృష్ణ, సర్పంచ్ నారాయణరాజు, పుత్తూరు మున్సిపాలిటీ తొలి చైర్మన్, దళితనాయకుడు అంకయ్య, అదే సామాజికవర్గానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు భువనేశ్వరి, జాన్ కెనడీ, అంబేడ్కర్ ట్రస్ట్ భవనం కోశాధికారి, రిటైర్డ్ టీచర్ కుప్పయ్య, బలిజ సంఘం పూర్వ అధ్యక్షుడు, శివాలయం మాజీ చైర్మన్ జలకం సునీల్ కుమార్, నగరికి చెందిన వైసీపీ నాయకుడు కేజే కుమార్ ముఖ్య అనుచరులైన శ్రీనివాసన్, సెడుం జయ్, దేశమ్మ దేవాలయం మాజీ చైర్మన్ బాబురెడ్డి, తడుకుపేటకు చెందిన మోహన్‌రావు తదితర నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వైసీపీలో కాంగ్రెస్ కలవరం



మరోవైపు కాంగ్రెస్ కూడా రేసులోకి వస్తోంది. ఆ పార్టీ తరపున పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నగరి, పుత్తూరులో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సభలను విజయవంతం చేయడంతో ఈ దఫా కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పరిణామం కూడా వైసీపీ క్యాంపులో ఆందోళన కలిగిస్తోంది. నామినేషన్ల పర్వంతో నగరి రాజకీయం హాట్‌హాట్‌గా మారనుంది.

అమ్మో.. బులుగు బ్యాచ్



బుధవారం.. టీడీపీ కండువా కప్పుకొంటూ -వారం కిందట వైసీపీ నేతలు కప్పిన కండువాతో మల్లికార్జున

కనపడితే చాలు.. వైసీపీ కండువా వేసేస్తున్నారు. ఇలా కండువా కప్పుకొన్న వాళ్లంతా లబోదిబోమంటున్నారు. ఇలా చౌడేపల్లె మండలం బత్తలాపురరంలో వారం కిందట ఇంటింటి ప్రచారానికి వచ్చిన వైసీపీ నేతలు తనకు కండువా కప్పారని మల్లికార్జున బుధవారం వాపోయారు. తాను 30 ఏళ్లుగా టీడీపీలో ఉన్నానని, ఇంకా కొనసాగుతానని చెప్పారు. అందుకనే రాజంపేట టీడీపీ నేత వెంకటరమణ చేతుల మీదుగా మళ్లీ టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు చెప్పారు. ఇటీవల శాంతిపురం మండలంలోనూ మీటింగుకని పిలిచి ఓ మహిళకు వైసీపీ కండువా కప్పారు. ఈ పరిణామంపై ఆమె రోదిస్తూ.. మళ్లీ టీడీపీలో చేరారు. ఈనెల 11న వ్యవసాయ పనులకు వెళుతున్న తమకు వైసీపీ వారు కండువా కప్పారంటూ పలమనేరు మండలం కురప్పల్లికి చెందిన ఆవేదన వ్యక్తంచేశారు. మరునటి రోజు వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఈ పరిణామాలను చూసి 'అమ్మో.. బులుగు బ్యాచ్' అంటూ జనం హడలిపోతున్నారు.

- పుంగనూరు/చౌడేపల్లె

● కోడ్ ఉల్లంఘన

డీఈవో కార్యాలయం ముందు 'సిద్ధం'



ఎన్నికల కోడ్ ఉంటే మాకేంటి? నిబంధనలు ఉల్లంఘిస్తే మమ్మల్ని అడిగేదెవరని వైసీపీ నేతలు అనుకున్నారేమో? ప్రభుత్వ కార్యాలయాల ముందు ఎటువంటి రాజకీయ ప్రచార బ్యానర్లు పెడుతున్నారు. చిత్తూరులోని ఎమ్మెస్సార్ సర్కిల్ సమీపంలోని డీఈవో కార్యాలయం ముందు సీఎం జగన్ ఫొటోతో ఉన్న సిద్ధం బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని అధికారులూ పట్టించుకోకపోవడం స్థానికుల నుంచి తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- చిత్తూరు సిటీ

ఆయనొస్తానంటే.. మేము వద్దంటాం

ఆయన 90వ దశకంలో టీడీపీ నేతగా రామకుప్పం మండలంలో ఒక వెలుగు వెలిగారు. ఎంపీపీగా, జడ్పీటీసీగా పనిచేశారు. నియోజకవర్గ నేతలపై కినుక వహించి 2010-14 మధ్య స్తబ్దుగా ఉండిపోయారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిశారు. 2014 ఎన్నికల్లో తాను సీఎం కాగానే రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇస్తానంటూ పార్టీ అధినేత హామీ కూడా ఇచ్చారట. ఏమైందో ఏమో గానీ, కొంతకాలానికే ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ సామాజిక వర్గ నేతగా 2014, 2019 ఎన్నికల్లో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో వైసీపీ తరపున ప్రచారం చేశారు. 2014లో వైసీపీ అధికారంలోకి రాకపోయినా ఆ పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారు. 2019లో అధికారంలోకి రావడంతో తనకు ప్రాధాన్యం గల నామినేటెడ్ పదవి వస్తుందని, ఈ మేరకు పార్టీలోని పెద్ద నేతలు హామీ ఇచ్చారని అందరికీ చెప్పుకొన్నారు. ఐదేళ్ల వరకు నిరీక్షించినా.. పదవి రాలేదు. ఈ బాధ ఒకవైపు.. వైసీపీ పాలనపట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో ఈసారి టీడీపీ అధికారంలోకి వస్తుందన్న భావనతో ఆ పార్టీ తలుపులు తట్టారు. నియోజకవర్గ కార్యాలయానికి వెళ్లి.. తాను సొంతగూటికి వస్తానని చెప్పారట. ఈయన రావడం వల్ల లాభంకన్నా.. నష్టమే ఎక్కువంటూ టీడీపీ నేతలు, సొంత పంచాయతీ శ్రేణులు పార్టీ అధిష్ఠానానికి తెలిపారు. పార్టీలోకి చేర్చుకోవద్దంటూ కుండబద్దలు కొట్టడంతో ఆయన చేరిక ఆగింది. టీడీపీలో చేరేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు తెలియడంతో వైసీపీ నేతలూ ఆయన్ను పట్టించుకోవడం మానేశారు. ఈ క్రమంలో ఆయన రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందో?

- రామకుప్పం

ఆ నలుగురూ...

- షర్మిల సభలతో వైసీపీలో ఆందోళన
- 4 నియోజకవర్గాల్లో బలమైన ప్రభావం
- వైసీపీ ఓట్లను పెద్దఎత్తున చీల్చే అవకాశం



జిల్లాలో వైసీపీకి కొత్త భయం పట్టుకుంది. ఇప్పటికే టీడీపీ, జనసేన,బీజేపీ కూటమిగా ఏర్పడి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంటే తాజాగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటనకు లభించిన ఆదరణ చూసి అధికార పార్టీ నేతలు తల పట్టుకుంటున్నారు. తమకు పడాల్సిన ఓట్లు కాస్తా కాంగ్రెస్ అభ్యర్థులకు మళ్లిపోతాయని కలవరపడుతున్నారు. ఏపీ న్యాయ్ యాత్ర పేరుతో ఆమె ఇటీవల పుత్తూరు, కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం పట్టణాల్లో రోడ్ షో నిర్వహించారు. ఊహించని రీతిలో ఆమెకు జనాదరణ దక్కింది. షర్మిల సూటిగా సంధించిన విమర్శనాస్త్రాలకు స్పందన లభించింది. దీంతో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఓట్లలో కోత పడినట్టేనా..

వైఎస్సార్ బిడ్డ షర్మిల.. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయడం జిల్లా వైసీపీకి నష్టం కలిగించే అంశమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రతి వేదిక మీదా ఆమె ప్రభుత్వ, జగన్ వైఫల్యాలను గట్టిగా ఎండగట్టారు. హామీల అమలు మరచిన తీరునూ గుర్తు చేశారు. నగరి, పూతలపట్టు, పలమనేరు, జీడీనెల్లూరు కాంగ్రెస్ అభ్యర్థులు రాకేష్‌రెడ్డి, ఎంఎస్ బాబు, శివశంకర్, రమేష్‌బాబు తమ నియోజకవర్గాల్లో కొంత ప్రభావితం చేయగలిగినవారే. పూతలపట్టు నియోజకవర్గంలో ఎంఎస్ బాబు సిటింగ్ ఎమ్మెల్యేగా తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కచ్చితంగా పెద్దఎత్తున వైసీపీ ఓట్లను చీల్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇప్పటికూ బంగారుపాళ్యం మండలంలోని పలువురు మైనార్టీలు కాంగ్రెస్‌లో చేరారు. జీడీ నెల్లూరులో కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ బాబు గత ఎన్నికల్లో మేనమామ, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి గెలుపు కోసం శ్రమించారు. నియోజకవర్గంలో పరిచయాలు, పట్టున్న నాయకుడు. నారాయణస్వామి వ్యతిరేక వర్గాన్ని తనవైపు మళ్లించుకుని వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిని ఇరకాటంలో పడేస్తారని భావిస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలో శివశంకర్ ప్రతి మండలంలోనూ తన టీమ్ ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేసుకుంటున్నారు. ఈ ముగ్గురూ డబ్బును కూడా ఖర్చు చేసి వైసీపీ అభ్యర్థుల ఓటమికి పని చేసేందుకు సమాయత్తమవుతున్నారు. నగరి కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్. ఈయన తండ్రి ప్రభాకర్‌రెడ్డి సీనియర్ కాంగ్రెస్ లీడర్. మాజీ మంత్రి చెంగారెడ్డి అనుచరులు కూడా. పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2019 ఎన్నికల్లో జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థులలో రాకేష్‌రెడ్డికే ఎక్కువగా (3357) ఓట్లు పోలయ్యాయి. ఈసారి కూడా వైసీపీ ఓట్లను చీల్చే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల్లోపు షర్మిల మరోసారి మిగిలిన నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తారనే సమాచారంతో వైసీపీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

హనుమంతరాయ.. ఆదుకోవయ్యా!



పుంగనూరు నియోజకవర్గంలోని రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారాలు, నామినేషన్ల దాఖలు సమయాల్లో ముందుగా హనుమంతురాయదిన్నె ప్రసన్న ఆంజనేయస్వామి అనుగ్రహం కోసం పూజలు చేసి కార్యక్రమాలు మొదలు పెట్టడం సెంటిమెంట్‌గా మారింది. పుంగనూరు నుంచి రామసముద్రం వెళ్లే మార్గంలో శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో ఈ ఆలయం ఉంది. పుంగనూరుకు దేవమూల(రాశిమూల), నైరుతిలో ఆలయం ఉండడమే ఈ సెంటిమెంట్‌కి కారణం. నామినేషన్ దాఖలు సమయాల్లో ఆలయంలో పూజలు చేసి ర్యాలీగా వెళ్లి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారు. ఇప్పటికే చల్లా రామచంద్రారెడ్డి (టీడీపీ), పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైసీపీ), బోడే రామచంద్ర యాదవ్(భారత చైతన్య యువజన పార్టీ)లు ఆంజనేయస్వామికి పూజలు చేసి ఎన్నికల ప్రచారాలు ప్రారంభించారు.

● సెంటిమెంట్

- పుంగనూరు